


'బాహుబలి' బయటికొస్తే తట్టుకుంటారా?

- వరంగల్‌లో జరిగే రజతోత్సవ సభకు కేసీఆర్ వస్తున్నారు
- సభ సాక్షిగా కేసీఆర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌ను ఎండగడతాం : తాతా మధు

7

'తలాపున పారుతోంది గోదారి... మన చేను, మన చెలక ఎడారి... ఏజెన్సీ రైతు బతుకు అమాస... పాలకులు చేస్తుంద్రు తమాషా.... మోసపోతిమన్న... అరిగోస పడత మన్నా....' అని సాగే పాట.. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉర్రూతలూగించింది. నీళ్లు, నిధులు, నియామకాలే ఎజెండాగా నాడు సాగిన ఉద్యమంలో గోదావరి జలాల అంశం కీలకపాత్ర వహించింది. ఉమ్మడి రాష్ట్రంలో నాగార్జున సాగర్ జలాలు ఏజెన్సీ ప్రాంతాలకు రానివ్వకుండా జరిగిన కుట్రల్ని తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాతైనా సరిదిద్దుతారని, గోదావరి జలాలు తమ పొలాలకు అందుతాయని ఆదివాసీ ప్రాంతాల ప్రజలు భావించారు. కానీ, వారి ఆకాంక్షలు నెరవేరలేదు. స్వరాష్ట్రంలో కూడా ఆయా ప్రాంతాలకు సమన్యాయం దక్కడం లేదు. ఇందుకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో చేపట్టిన సీతారామ ఎత్తిపోతల పథకమే ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తోంది.



దుమ్ముగూడెం వద్ద సీతారామ ప్రాజెక్టు ప్రాంతం

ఆంధ్రజ్యోతి ఫోకస్

ఎన్నాళ్లీ కన్నీళ్లు!?

భద్రాద్రి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలకు సాగునీరు కరువు


- 'సీతారామ ప్రాజెక్టు' డిజైన్‌లో మార్పుతో ఏజెన్సీ వాసుల ఆశలు అడియాసలు
- తలాపున గోదావరి ఉన్నా అందని చుక్కనీరు
- ఎన్ఎస్‌పీ ఆయకట్టుకు సీతారామ ప్రాజెక్టు జలాలను తరలించడంపై ఆక్షేపణలు
- కుట్రపూరితంగా ప్రాజెక్టు డిజైన్‌ను మార్చారని విపక్షాలు, ప్రజాసంఘాల విమర్శలు
- భద్రాద్రి జిల్లా సహా ఇల్లెందు ఏజెన్సీకి జలాలు అందించాలని భిన్నవర్గాల పోరుబాట
- అసెంబ్లీలోనూ ప్రస్తావించిన ఎమ్మెల్యే కనకయ్య

ఇల్లెందు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అనేక పుణ్యక్షేత్రాలను, ప్రాంతాలను స్పృశిస్తూ ప్రవహిస్తున్న పావన గౌతమి జలాలు.. నెర్రెలు బారుతున్న తమ భూములను తడపడం లేదని ఇల్లెందు ఏజెన్సీ ప్రాంత ప్రజలు ఆక్రోశిస్తున్నారు. సీతారామ ప్రాజెక్టుతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని గిరిజన ప్రాంతాలను సస్యశ్యామలం చేస్తామన్న పాలకుల హామీలు ఇప్పటికీ నెరవేరలేదు. జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల భూములకు గోదావరి జలాలు అందించకుండా, ఇప్పటికే నాగార్జునసాగర్ జలాలతో రెండు పంటలు పండిస్తున్న నియోజకవర్గాలకే తరలించడం పట్ల ఏజెన్సీ ప్రాంత రైతులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను నదీ పరీవాహక ప్రాంతాల భూములకే అందించాలన్న డిమాండ్‌తో వివిధ రాజకీయ పార్టీలు ఆందోళనకు సమాయత్తమవుతున్నాయి.

సీతారామ ప్రాజెక్టు తొలి డిజైన్ ఏమిటి...? దానిలో ఎందుకు మార్పులు చేశారు...? రీడిజైన్ భవిష్యత్ ఏమిటి..? ఏజెన్సీ మండలాలకు చుక్క నీరు అందకుండా కాలువను ఎందుకు దారి మళ్లించారు..? అనే అంశాలపై గిరిజన రైతాంగం కన్నెర్ర జేస్తోంది. మూడు జిల్లాల ఆయకట్టుతోపాటు ఇల్లెందు నియోజకవర్గానికి సాగునీరు అందించేలా సీతారామ ప్రాజెక్టును రూపకల్పన చేయగా, ఇప్పుడు డిజైన్‌ను మార్చి తమకు తీరని అన్యాయం చేస్తున్నారంటూ అధికార పార్టీకి చెందిన ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య రాష్ట్ర శాసనసభలో ధ్వజమెత్తారు. ఈక్రమంలో ఇప్పుడు సీతారామ ప్రాజెక్టు హాట్‌టాపిక్‌గా మారింది. అటు అధికార పార్టీలో, ఇటు విపక్షాల్లో ఈ ప్రాజెక్టు చర్చనీయాంశంగా మారగా, ప్రజాక్షేత్రంలో ఉద్యమానికి ఆజ్యం పోస్తోంది.

ప్రాజెక్టుకు పునాది ఇల్లెందు ఏజెన్సీలోనే...

భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల్లో 6.74 లక్షల ఎకరాలకు గోదావరి నుంచి సాగునీరు అందించే లక్ష్యంతో సీతారామ ప్రాజెక్టుకు గత ప్రభుత్వం రూపకల్పన చేసింది. 2016 ఫిబ్రవరి 16న అప్పటి సీఎం కేసీఆర్ ఇల్లెందు నియోజకవర్గంలోని టేకులపల్లి మండలం రోళ్లపాడు వద్ద ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. సీతమ్మ సాగర్ బ్యారేజీ పాయింట్ నుంచి మెయిన్ కెనాల్ ఏర్పాటు చేసి మణుగూరు అశ్వాపురం, బూర్గంపహాడ్, (మిగతా 6వ పేజీలో)



సీతారామ ప్రాజెక్టు మ్యాపు

నిర్దేశిత ఆయకట్టుకు సాగునీరు ఇస్తాం..

కోరం కనకయ్య, ఇల్లెందు ఎమ్మెల్యే



ఇల్లెందు నియోజకవర్గానికి గోదావరి జలాల్లో తొలి ప్రాధాన్యం ఇవ్వాలి. సీతారామ ప్రాజెక్టుకు 2016లో శంకుస్థాపన జరిగిన పిదప 2018లో నేను ఓటమి చెందాను. ఆ సమయంలో గెలిచిన ఎమ్మెల్యే, అధికారంలో ఉన్న మంత్రులు ప్రాజెక్టు గురించి నోరు మెదపలేదు. 2023లో గెలిచిన తర్వాత ఏజెన్సీ ప్రాంతాల సాగునీటి సమస్యను నేను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి, జిల్లాకు చెందిన మంత్రుల దృష్టికి తీసుకెళ్లాను. ఇందిరమ్మ ప్రభుత్వంలో మూడు జిల్లాలకు సాగు నీరు అందిస్తాం.. బీఆర్ఎస్ పాలనలో నోరుమెదపని విపక్షాలు నేడు రాజకీయ ప్రయోజనాల కోసం పాకులాడుతున్నాయి.

రాజీవ్ సాగర్ డిజైన్‌ను అమలు చేయాలి..

గుమ్మడి నర్సయ్య, మాజీ ఎమ్మెల్యే



ఏజెన్సీ ప్రాంతాలకు గోదావరి జలాలు అందించడానికి అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రూపొందించిన రాజీవ్ సాగర్ ప్రాజెక్టు ప్రతిపాదనలే శరణ్యం. ఆర్థిక భారం పెద్దగా లేకుండా జిల్లా మొత్తం సాగు నీరందించడానికి నాడు అండర్ గ్రౌండ్‌ద్వారా పైప్‌లైన్లు ఏర్పాటు చేశారు. అశ్వాపురం అమ్మగారిపల్లి గ్రామం నుంచి ఇల్లెందు వరకు ఏర్పాటు చేశారు. కానీ కేసీఆర్ సీఎం కాగానే ఇల్లెందు వరకు వేసిన రాజీవ్‌సాగర్ పైపులైన్లను భూముల నుంచి పెకిలించి తీసుకెళ్లారు. కేసీఆర్‌ను కొందరు తప్పుదోవ పట్టించడం పైప్‌లైన్లను తొలగించినట్లు ప్రచారం ఉంది. ఆ తర్వాత తీసుకువచ్చిన సీతారామ ప్రాజెక్టుకు క్లియరెన్సులు రావడం లేదని సాకులు చెబుతున్నారు. దుమ్ముగూడెం నుంచి కిన్నెరసానికి అక్కడినుంచి రోళ్లపాడుకు గోదావరి జలాలు మళ్లించి, తిరిగి అక్కడి నుంచి వాగుల ద్వారా సాగు నీరు అందించవచ్చు.

ఫైనాన్స్ క్లియరెన్స్ ఇవ్వాలి...

బి.హరిప్రియ, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే



మూడు జిల్లాల పరిధిలో దాదాపు 7లక్షల ఎకరాలకుసాగు నీరందించేందుకు నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది. 2016నుంచి ముందుకు సాగని ప్రాజెక్టు పనులపై నేను ప్రత్యేక దృష్టి సారించి కేసీఆర్‌తో చర్చించాను. దీంతో ఇల్లెందు, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం నియోజకవర్గాలకు తాగు, సాగునీరు అందించేందుకు రూ.3,320 కోట్ల అంచనాతో డిజైన్ రూపొందించారు. కానీ నేటి వరకు ఫైనాన్స్ క్లియరెన్స్ లభించలేదు. ఏజెన్సీ ప్రాంతాల రైతులను మోసగించేందుకు జరుగుతున్న కుట్రలను అడ్డుకుంటాం. ఒకేసారి బడ్జెట్ క్లియరెన్స్ ఇచ్చి పనులు ప్రారంభించాలి. ప్రాజెక్టుకు శంకుస్థాపన జరిగిన నాడు అధికారంలో ఉన్న నాయకులే నేడు కూడా అధికారంలో ఉన్నారు.

ప్రణాళికబద్ధంగా నగర అభివృద్ధి

- పరిసరాలను శుభ్రంగా ఉంచటం ప్రజల సామాజిక బాధ్యత
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- 16వ డివిజన్‌లో రూ.కోటి పనులకు శంకుస్థాపన



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన నగరంగా ఖమ్మాన్ని రూపుదిద్దేందుకు ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేయటం జరుగుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం ఖమ్మంనగరంలోని 16వ డివిజన్‌లో రూ. కోటి అభివృద్ధి పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపనలు చేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రసంగించారు. ఖమ్మం నగరంలో చేపట్టిన, చేపట్టబోయే అభివృద్ధి పనులపై క్షుణంగా వివరించారు. నగరంలోని అన్ని ప్రభుత్వశాఖల సమన్వయం ఉంటేనే అభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రజాప్రతినిధులు కూడా ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. నది, కాల్వలు ఆక్రమణలు కచ్చితంగా తొలగించాలని ఆదేశించారు. రహదారిపై ఏ మతానికి చెందిన ఆలయాలు, ప్రార్థన మందిరాలు ఉండొద్దని సూచించారు. ఆక్రమణల్లో నిరుపేదలు ఉంటే వారికి కచ్చితంగా అధికారులు పునరావాసం చూపించాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యత, జీవనోపాధి చూపించాలన్నారు. ఖమ్మంలో చేపట్టిన అండర్ డ్రెయినేజీ నిర్మాణాలు వర్షాకాలం వచ్చే లోపుగా పూర్తి చేయాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పనులు వేగంగా జరపాలని కోరారు.

నగర మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ మంత్రి తుమ్మల ప్రత్యేక చొరవతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అత్యధిక నిధులు మంజూరు చేయించారన్నారు. ఖమ్మం ఏఎంసీ చైర్మన్ యర్రగర్ల హనుమంతరావు, కార్పొరేటర్లు మేడారపు వెంకటేశ్వర్లు, రాపర్తి శరత్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు పాలేపు వెంకటరమణ, సాధు రమేశ్‌రెడ్డి, ఆర్డీవో నర్సింహరావు, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మిర్చికి ధరాఘాతం!

- వచ్చే సీజన్‌లో గణనీయంగా తగ్గనున్న సాగు విస్తీర్ణం
- ధరలు గణనీయంగా తగ్గడంతో ప్రత్యామ్నాయ పంటల వైపు రైతుల చూపు
- ఎగుమతులు పడిపోవడమే కారణమంటున్న వ్యాపారులు
- రూ.15వేల నుంచి రూ.10వేలకు పడిపోయిన ధర
- పెట్టుబడులూ రావడం లేదని రైతుల ఆవేదన
- సాగు తగ్గితే అనుబంధ రంగాలపైనా ప్రతికూల ప్రభావం



ఖమ్మం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఎర్రబంగారం (మిర్చి) ధరలు రోజురోజుకు తగ్గుతుండడంతో వచ్చే వ్యవసాయ సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో మిర్చి సాగు భారీగా తగ్గబోతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. పెట్టుబడుల భారం, గిట్టుబాటు ధరల సమస్యతో రైతులు మిర్చిసాగుకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడింది. మిర్చిసాగులో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జిల్లాకు ప్రత్యేక గుర్తింపు ఉండేది. సుమారు లక్షన్నర ఎకరాల్లో మిర్చిసాగు జరుగుతుండగా ఘాటు, రంగు, రుచి ఉండే తేజ రకం మిర్చి సాగుకు జిల్లా ప్రసిద్ధి. ఉమ్మడి జిల్లాలో పండిన మిర్చిని ఖమ్మం, గుంటూరు, జగదల్‌పూర్, నాగపూర్ మార్కెట్లకు రైతులు, వ్యాపారులు తీసుకెళ్లి అమ్ముతున్నారు.

గడిచిన మూడేళ్లలో మిర్చి ధర బాగా ఉండడంతో రైతులు లాభాలు చూడగా, తామరపురుగు దెబ్బతో దిగుబడులు తగ్గినా పండిన కొద్దిపాటి మిర్చికి ధర లభించడంతో రైతులు నష్టాలు లేకుండా మిర్చి సాగును కొనసాగించారు ఈ ఏడాది ఉమ్మడిజిల్లాలో సుమారు లక్షా 20 వేల ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. అయితే దిగుబడులు ఆశాజనకంగా ఉండకపోవడం, దేశీ, విదేశీ ఆర్డర్లు లేకపోవడంతో ధర (మిగతా 6వ పేజీలో)

వచ్చే సీజన్‌లో తగ్గనున్న మిర్చి సాగు

రాబోయే వానాకాలం సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో మిర్చిసాగు సగానికి తగ్గబోతున్నట్లు వ్యవసాయశాఖ అంచనా వేసింది. మిర్చిసాగుకు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, పత్తి తదితర పంటలవైపు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఖమ్మం జిల్లాలో 90 వేల నుంచి లక్ష ఎకరాల వరకు మిర్చిసాగు అయ్యే పరిస్థితి ఉండగా వచ్చే వానాకాలం సీజన్‌లో 53 వేల ఎకరాలే సాగుచేసే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. భద్రాద్రి జిల్లాలో 50 వేల ఎకరాల్లో మిర్చి సాగయ్యే పరిస్థితి ఉండగా, 10 నుంచి 15 వేల ఎకరాల్లోపే మిర్చి వేసే పరిస్థితి ఉందని అంచనాలు సిద్ధం చేశారు. మొత్తం మీద ఉమ్మడి జిల్లాలో మిర్చి సాగు తగ్గితే అది మార్కెట్‌పై ప్రభావం చూపనుంది. మిర్చిసాగుతో విత్తనాలు, ఎరువులు కోట్లాది రూపాయల వ్యాపారం నడుస్తోంది. అలాగే జిల్లా నుంచే కాకుండా పొరుగున ఉన్న ఛత్తీస్‌గఢ్, ఏపీ, మహారాష్ట్ర, ఒడిసా ప్రాంతాల నుంచి కూడా వేలాది మంది వ్యవసాయకూలీలకు మిర్చి సాగు ఉపాధి చూపుతోంది. సాగు తగ్గితే ఉపాధిరంగంపై ప్రభావం పడనుంది.



తరుగు.. తగవు...

- రబీ ధాన్యం కొనుగోళ్లలో కోత పెడుతున్న మిల్లర్లు
- తాలు, చెత్త పేరుతో తగ్గింపు
- మంత్రి, కలెక్టర్ ఆదేశాలను పట్టించుకోని వ్యాపారులు

6



అన్నదాతలు వెదర్ యాప్ వాడాలి

- వర్షం ఎప్పుడు పడుతుందో తెలుసుకోవచ్చు..
- డీఎస్‌వో చందన్‌కుమార్



భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

- నగరంలో క్రైస్తవుల మహా ర్యాలీ
- ప్రత్యేక సందేశం ఇచ్చిన బిషప్ ప్రకాష్

6



యూట్యూబర్స్ దేశాన్వేషణ

సత్తుపల్లి రూరల్, ఏప్రిల్18 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నుంచి దేశ అన్వేషణకు బయల్దేరిన యూటూబర్స్ శుక్రవారం రాత్రి సత్తుపల్లి చేరుకున్నారు. రాజమండ్రి, వైజాగ్ మీదుగా ఒరిస్సా వెళ్లి అక్కడి నుంచి ఆల్ ఓవర్ ఇండియా పర్యటించనున్నట్లు సాయికృష్ణ, అజీజ్, సన్నీ తెలిపారు. ఈ యాత్రలో భాగంగా ఆయా ప్రాంతాల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలను ఈ ప్రపంచానికి తెలియజేసేందుకు తమ అన్వేషణ సాగుతుందని, ఆరు నెలల నుంచి ఏడాది వరకు పూర్తిగా దేశంలోనే పర్యటించనున్నట్లు చెప్పారు.

మహిళల స్వావలంబనే లక్ష్యం

- పకడ్బందీ ప్రణాళికతో ఇందిర డెయిరీ
- గేదెల కొనుగోలును లబ్ధిదారుల ఇష్టానికే వదిలేయాలి
- టూరిజం స్పాట్లుగా మధిర, జమలాపురం చెరువులు
- మధిర నియోజకవర్గ అభివృద్ధిపై డిప్యూటీ సీఎం భట్టి సమీక్ష



హైదరాబాద్‌లో సమీక్ష నిర్వహిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

మధిర టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మహిళల స్వావలంబనే లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఇందిర డెయిరీలో గేదెల కొనుగోలు పారదర్శకంగా జరగాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధికారులకు సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని అంబేద్కర్ సచివాలయంలో ఇందిర డెయిరీ, నియోజకవర్గంలో చెరువులు, పర్యాటక రంగ పనుల అభివృద్ధిపై జరిగిన విస్తృతస్థాయి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. డెయిరీలో గేదెల కొనుగోలు అనేది కీలక అంశమని, ఈ వ్యవహారం అంతా అదనపు కలెక్టర్ స్థాయి అధికారి, డీఆర్‌డీఏ పీడీ పర్యవేక్షణలో జరగాలని ఆదేశించారు. 20వేల మంది లబ్ధిదారులకు 40వేల గేదెలతో డెయిరీ ప్రారంభిస్తున్న నేపథ్యంలో గేదెల కొనుగోలు విషయం లబ్ధిదారుల ఇష్టానికి వదిలి వేయాలని అన్నారు. గేదెలకు అవసరమైన గడ్డి పెంపకానికి స్థలం ఎంపిక చేయాలని, గేదెలు కొనుగోలు చేశాక ఇన్సూరెన్స్ చేయించాలని గేదెల సంరక్షణ, పాల సేకరణ, మార్కెటింగ్ తదితర అంశాలపైన లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించేందుకు ముల్కనూరు, విజయ డెయిరీల సందర్శనకు విడతల వారీగా మహిళలను తీసుకువెళ్లాలని ఆదేశించారు. మధిర, జమలాపురం చెరువులను టూరిజం ప్రాజెక్టులుగా అభివృద్ధి చేసేందుకు అనుమతులు వచ్చినందున వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని ఇరిగేషన్, పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టులో భాగంగా నిర్మించనున్న కాటేజీలు, బోట్స్, మినీ హాల్స్‌కు సంబంధించిన డిజైన్లను పరిశీలించారు. వీటితోపాటు మాటూరు, బయ్యారం, కలకోట, చిరుమర్రి, ముత్తారం, చింతకాని చెరువులు పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై సమీక్ష జరిపారు. ఈ సమీక్షలో సెర్ప్ డైరెక్టర్ రజిత, డీఆర్‌డీవో పీడీ సన్యాసయ్య, నాబార్డ్ కన్సల్టెన్సీ శిల్పా దేశ్, ఇరిగేషన్ సీఈ రమేష్‌బాబు, ఈఈ రామకృష్ణ, ఇందిరా డెయిరీ అధికారులు శ్రీనివాస్, లక్ష్మణరావు, ఐదు మండలాల ఏపీఎంలు పాల్గొన్నారు.

మినరల్ డీలర్ లైసెన్స్ ఉంటేనే పర్మిట్

గనులు భూగర్భ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సాయినాథ్

ఫటాఫట్



ప్రశ్న: జిల్లాలో మొత్తం ఎన్ని లీజు క్వారీలు ఉన్నాయి? అందులో ఎన్ని నడుస్తున్నాయి?

జవాబు: జిల్లాలో మొత్తం 168 క్వారీలకు లీజులు ఉన్నాయి. వాటిలో 118 క్వారీలు నడుస్తున్నాయి. బొగ్గు క్వారీలు 4, బైరటీస్ 1, కోరండం 1, డోలోమైట్ 4, క్వార్జ్ 1, బ్లాక్ గ్రానైట్ 106, కలర్ గ్రానైట్ 1, స్టోన్ అండ్ మెటల్ 48, గ్రావెల్ 2, మొత్తం 168 క్వారీలకు లీజులు ఉన్నాయి.

ప్ర: జిల్లాలో అక్రమ మైనింగ్ జరుగుతుందనే వాదనలు వినపడుతున్నాయి నిజమేనా?

జ: జిల్లాలో అక్రమ మైనింగ్‌ను నిర్మూలించాం. అక్రమ మైనింగ్ నిర్వహించిన వారిపై కేసులు నమోదు చేసి భారీగా అపరాధ రుసుం వసూళ్లు చేస్తున్నాం. బ్లాక్ గ్రానైట్, స్టోన్ అండ్ మెటల్ క్వారీలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి అక్రమ మైనింగ్ జరగకుండ చూస్తున్నాం.

ప్ర: జిల్లాలో ఎన్ని అక్రమ మైనింగ్ కేసులు నమోదు చేశారు? ఎంత అపరాధ రుసుం వేశారు?

జ: జిల్లాలో మొత్తం 13అక్రమ మైనింగ్ కేసులు నమోదు చేశాం. వాటికి రూ.100 కోట్లకు పైగా అపరాధ రుసుం చెల్లించాలని నోటీసులు అందించాం. కొందరు వన్‌టైం సెటిల్‌మెంట్ కింద అపరాధ రుసుంలు చెల్లిస్తున్నారు. అపరాధ రుసుం చెల్లించన వారి క్వారీ లీజులు రద్దవుతాయి.

ప్ర: 2024-25 సంవత్సరానికి మైనింగ్ శాఖ ఆదాయం ఎంత టార్గెట్? ఎంత పూర్తయింది?

జ: 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.117.90 కోట్లు నిర్దేశించగా 2025 మార్చి 31 నాటికి రూ.101.78 కోట్లు ఆదాయం సమకూరింది.

ప్ర: కొత్తగా ఎమైనా టీపీ(టెంపర్‌వరీ పర్మిట్)లు ఇస్తున్నారా?

జ: జిల్లాలో కేవలం గ్రావెల్ క్వారీలకు మాత్రమే టీపీలు ఇస్తున్నాం. అగికూడా నేషనల్ రోడ్లకు, ఆర్‌అండ్‌బీ రోడ్లకు మాత్రమే అనుమతులు ఇస్తూ టీపీలు ఇస్తున్నాం. ఆ మట్టిని మరి ఏ ఇతర అవసరాలకు వాడుకున్నా టీపీని రద్దు చేసి, పెనాల్టీలు వేస్తాం.

ప్ర: జిల్లాలో ఎన్ని క్వారీలు వైలేషన్‌లో ఉన్నాయి? (వైలేషన్ అంటే ఎన్విరాన్‌మెంట్ సర్టిఫికెట్ లేని లీజు క్వారీలను వైలేషన్ క్వారీలు అంటారు)

జ: 20 క్వారీలు వైలేషన్‌లో ఉన్నాయి. వారందరూ ప్రస్తుతం లీజు పిరియడ్ పూర్తయి తిరిగి రెన్యువల్ చేయించుకునేందుకు రాగా వారి క్వారీలు వైలేషన్‌లో ఉండటంతో కోర్టును ఆశ్రయించారు.

ప్ర: ఎండీఎల్ (మినరల్ డీలర్ లైసెన్స్) ఉంటేనే పర్మిట్లు ఇస్తారా?

జ: ప్రస్తుతం ఏప్రిల్ నెలాఖరు వరకు ఎండీఎల్‌కు దరఖాస్తు చేసిన వారికి పర్మిట్లు ఇస్తున్నాం. మే నుంచి ఎండీఎల్ ఉన్న పరిశ్రమలకే పర్మిట్లు జారీ చేయటం జరుగుతుంది. జిల్లాలో నేటికి 210 స్లాబ్ పరిశ్రలు ఎండీఎల్ లైసెన్స్ పొందారు. మిగిలిన వాళ్ల త్వరగా లైసెన్స్ తీసుకోవాలి.

ప్ర: టైల్స్ పరిశ్రమకు ఎండీఎల్ వర్తించదా?

జ: ప్రభుత్వం జారీ చేసిన జీవోలో కేవలం స్లాబ్ పరిశ్రమకే ఎండీఎల్ అని ఉంది. టైల్స్ పరిశ్రమకు పాత పద్ధతిలోనే పర్మిట్లు జారీ చేస్తున్నాం.

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం ఖానాపురంహవేలి

వెదర్ యాప్‌ను సద్వినియోగం చేసుకోండి

- ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద యాప్
- కొనుగోళ్లను పరిశీలించిన డీఎస్వో చందన్‌కుమార్



ధాన్యాన్ని మిల్లులకు ఎక్కిస్తున్న దృశ్యం

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి నష్టం కలగకుండా వెదర్ యాప్‌ను అందుబాటులో ఉంచినట్టు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్ తెలిపారు. సివిల్ సప్లయి కమిషనర్ ఆదేశాల మేరకు ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్టు తెలిపారు. యాప్ జిల్లాలోని పీపీసీ సెంటర్ల వద్ద ఎప్పుడు వర్షం పడుతుంది. ఎన్ని గంటలకు వర్షం పడుతుంది అన్నది సమాచారం కచ్చితంగా తెలియ చేస్తుందన్నారు. దీని వల్ల రైతులు ముందస్తుగా అప్రమత్తం అయి తగిన జాగ్రత్తలు తీసుకొని పంట నష్టం జరగకుండా కాపాడుకోవచ్చన్నారు. జిల్లా రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లాలో పలు కొనుగోలు కేంద్రాలను డీఎస్వో శుక్రవారం సందర్శించారు. జిల్లాలో ఇప్పటివరకు ఫైన్ రకం 8,646.520, కామన్ రకం 1982.240 మొత్తం 10,628.760 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి ప్రోత్సాహంగా అందించే బోనస్ జిల్లాలో ఇప్పటివరకు రబీ సీజన్లో 115 రైతులకు 10,864.8 క్వింటాళ్లకుగాను రూ.54లక్షల 32,400 రైతుల ఖాతాలో నగదు జమ చేసినట్లు ఆయన తెలిపారు.

కోతల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పూర్తిగా ఎండిపోతే పంటనష్టం జరిగే ఆస్కారం



ఖమ్మం వ్యవసాయం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వరి కోతలు ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్నాయి. పంట చేతికొచ్చిన సమయంలో కోతలు చేపట్టకపోతే రైతులు నష్టపోయే ఆస్కారం ఉంది. చేను పూర్తిగా ఎండినా, పండువారినా కోత సమయంలో గింజలు రాలుతాయి. పంట చేతికొచ్చినప్పటి నుంచి కోతలు, ధాన్యం నిల్వ చేయడం వంటి వాటిపై రైతులు అవగాహన పెంచుకోవాలి. వరికోతల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సూచనలు, సలహాలు ఇస్తూనే ఉన్నారు. పంట నాణ్యంగా ఉంటేనే ధర వస్తుంది. కొన్ని నెలల పాటు ధాన్యం నిల్వ ఉంటుంది. చేను పండువారిన తరువాత కోతకు 15 రోజుల ముందే నీటి తడులు నిలిపేయాలి. గెలకున్న చివరి గింజ పాలుతాగి పసు పెక్కే వరకూ పంట కోయొద్దు. ముందే కోస్తే తాలు గింజలవుతాయి. అలాగే మంచు కురిసే సమయాల్లో కోస్తే గింజలు మెత్తబడి ధాన్యం నలుపెక్కుతుంది. ఇలా అని కోతలు ఆలస్యమైతే ఎండకు గింజ పగుళ్ల వచ్చి వడ్లు నూక అవుతాయి. 80 నుంచి 90శాతం వరి వెన్నుల పసుపు రంగుకు మారుతున్న సమయంలో పంట కోయాలి. ఆకులు పూర్తిగా ఎండిపోయే వరకు చేనును ఉంచకూడదు. ఈ దశలో వడ్లలో సాధారణంగా 18-20శాతం తేమ ఉంటుంది. తేమ శాతాన్ని తగ్గించేందుకు రెండు మూడు రోజులు మెద ఎండపెట్టాలి. హార్వెస్టర్‌తో కోస్తే వెంటనే కల్లంలో ఆరబోయాలి. రాత్రిళ్ల మంచు తగలకుండా కుప్పచేసి కవర్ కప్పాలి. ఒక వేళ వర్షం వస్తే 5 శాతం ఉప్పు కలిపిన నీటిని చేనుపై పిచికారి చేయాలి. హార్వెస్టర్లలో దుమ్ముధూళి, మట్టి పెల్లలు ఉండకుండా చూసుకోవాలి. కోత సమయాల్లో వేర్వేరు రకాల ధాన్యం కలవకుండా చూసుకోవాలి. కోతల తర్వాత వడ్లను తూర్పారబట్టి శుద్ధి చేయాలి. ధాన్యంలో తేమ 12 నుంచి 14 శాతం తగ్గే వరకు ఎండబోయాలి. ఇలా చేస్తే ధాన్యం ఎక్కువ రోజులు నిల్వ ఉంటుంది. నిల్వ సమయంలో అధిక తేమ లేకుండా చూసుకోవాలి. ధాన్యాన్ని ఆశించే కీటకాల నుంచి రక్షణకు పరిసరాల్లో పొగబెట్టాలి. గోనె సంచులు, గుమ్మిళ్లలో ధాన్యాన్ని నిల్వ చేయాలి. నిల్వ చేసే చోట తడి లేకుండా, బస్తాలకు చిల్లులు లేకుండా చూసుకోవాలి.

పొలంలో గింజలతో పంటలో కల్తీ

మడుల్లో ధాన్యం గింజలు పడకుండా చూసుకోవాలి. లేకుంటే వచ్చే సంవత్సరం ఈ గింజలే మొలిచి ఇతర పంట ఉత్పత్తులు కల్తీ అవుతాయి. వరి పొలంలో కంకులు మొత్తం ఎండే వరకు ఆగాలి. దీంతో రైతులకు నాణ్యమైన ఉత్పత్తులు వస్తాయి. పొలం కోసిన తర్వాత కలుపు, ఇతర మొక్కలు ఏమైనా ఉంటే తీసివేయాలి. ఇలా చేస్తే పంటసాగులో కలుపు నివారణ సులువవుతుంది.

రేపటి నుంచి ఓపెన్ పరీక్షలు

8 పరీక్షా కేంద్రాలు, 1553 మంది అభ్యర్థులు

ఖమ్మం ఖానాపురంహవేలి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం హైదరాబాద్ ఆధ్వర్యంలో ఓపెన్ స్కూ ల్ పదో తరగతి, ఇంటర్ 2025 థియరీ పబ్లిక్ పరీక్షలు రేపటి (ఆదివారం)నుంచి ఈ నెల 26 వరకు నిర్వహిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ, ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ పాపారావులు తెలిపారు. ఈ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మొత్తం 8 పరీక్షా కేంద్రాల్లో 1553 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. పదో తరగతికి నాలుగు పరీక్షా కేంద్రాల్లో 655 మంది, ఇంటర్మీడియట్‌కు నాలుగు పరీక్షా కేంద్రాల్లో 898 మంది పరీక్షలు రాయనున్నారు. పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలకు 8 మంది చీఫ్ సూపరింటెండెంట్స్, 8 మంది డిపార్ట్‌మెంట్ అధికారులను నియమించారు. రెండు ప్లయింగ్ స్క్వాడ్స్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియమించారు. పరీక్షా కేంద్రాల వద్ద బీయస్‌యస్ 163 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ఉన్న జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లను మూసివేయాలని ఆదేశాలు జారీచేశారు. పరీక్షా కేంద్రాలలోకి అభ్యర్థులు, పరీక్షా సిబ్బంది సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకూడదని తెలిపారు.



మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసిన ఎస్‌సీహెచ్‌పీఎస్ నాయకులు

ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాల సమస్య పరిష్కరిస్తాం

- హామీ ఇచ్చిన మంత్రి దామోదర రాజనర్సింహ
- ఎస్‌సీహెచ్‌పీఎస్ అధ్యక్షుడు బొమ్మెర శ్రీనివాస్

చుంచుపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి):ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాల సమస్య పరిష్కరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యే వరకు అండగా ఉంటానని మంత్రి దామోదర రాజనర్సింహ హామీ ఇచ్చినట్లు ఎస్‌సీహెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మెర శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. హైదరాబాద్‌లో మంత్రి దామోదర రాజనర్సింహ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడ్డాక ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాల స్థానిక రాజకీయ రిజర్వేషన్లు, సాగు భూములకు హక్కు పత్రాలు, స్థానిక ఉద్యోగ నియామకాలు లేకుండా అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో ఎస్సీ నిరుపేదలను (గిరిజనేతరులు)గా అభివృద్ధి చెందిన కులాలతో జతకట్టి అభివృద్ధికి దూరం చేశారన్నారు. ఈ సమస్యపై సానుకూలంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పందించారని తెలియజేశారు. కార్యక్రమంలో మంత్రిని కలిసిన వారిలో షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట జేఏసీ గౌరవ సలహాదారు హైకోర్టు న్యాయవాది మల్లన్న, రాష్ట్ర కమిటీ సభ్యులు బలవంతపు సంపత్‌కుమార్, రజిని అంబేద్కర్, రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఎనగంటి కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

కులగణనను అడ్డుకోవడానికే సోనియా, రాహుల్‌పై కేసులు

రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య

భద్రాచలం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): దేశంలో కుల గణన అడ్డుకోవడానికే సోనియా, రాహుల్‌పై అక్రమ కేసులు బనాయించారని, రాహుల్‌ని చూసి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భయపడుతోందని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య అన్నారు. భద్రాచలంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఈవీ మిషన్లు కాదు, బ్యాలెట్ పేపరు కావాలన్న ఏఐసీసీ ప్లీనరీ నిర్ణయానికి బీజేపీ భయపడుతోందన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి ప్రజలే కాంగ్రెస్‌ను గెలిపించుకుంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ చింతిరాల రవికుమార్, సీనియర్ నాయకులు టి.వెంకటేశ్వరరావు, చింతిరాల సుధీర్ కుమార్, ఎడారి ప్రదీప్, అరుణ్, వరుణ్, వాసిరెడ్డి సాంబశివరావు, కాపుల ఏసు, సేవాదళ్ నాయకులు పాల్గొన్నారు.

'సీతారామ' నీటిని.. గార్ల, బయ్యారానికి మళ్లించాలి

రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రకు వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న అఖిలపక్షం నాయకులు

గార్ల (మహబూబాబాద్ జిల్లా), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సీతారామ ప్రాజెక్టు డిజైన్ మార్పుపై విచారణ జరిపించి.. గార్ల, బయ్యారం మండలాలకు సాగునీటిని అందించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకరావాలని కోరుతూ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రకు అఖిల పక్షనాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. శుక్రవారం గార్ల మండల కేంద్రంలో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమానికి ఎంపీ హాజరుకాగా, ఆయనను వారు కలిశారు. గార్ల రైల్వేస్టేషన్‌లో పలు రైళ్లను నిలుపాలని, సీతారామ ప్రాజెక్టు కాల్వ పనులపై వినతిపత్రాలను అందచేశారు. పై అంశాలను పరిష్కరించాలని పేర్కొన్నారు. రవిచంద్రను కలిసిన వారిలో శివాజీ, మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్, జంపాల వెంకన్న జి. సక్రు, మాన్యనాయక్, జంపిల విశ్వ, లక్ష్మణ్‌నాయక్ ఉన్నారు.

అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయండి

మంత్రి ఉత్తమ్‌కు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య వినతి



ఇల్లెందు టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సీతారామ ప్రాజెక్టుపై ము ఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు తక్షణమే అఖిలపక్షాన్ని ఏర్పాటు చేయాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో శుక్రవారం రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమకుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందచేశారు. సీతారామ ప్రాజెక్టు విషయం లో ఇల్లెందు నియోజకవర్గానికి తీరని అన్యాయం జరుగుతుందని, గతం లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేయగా జిల్లాలో ఉన్న రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, ఈ హామీ మేరకు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని నర్సయ్య డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన మంత్రి ఉత్తమకుమార్‌రెడ్డి త్వరలోనే అఖిలపక్షాన్ని ఏర్పాటుచేసే విధం గా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నర్సయ్య వెంట అఖిలపక్ష నాయకులు గోపగాని శంకర్‌రావు, బండారి మోహన్‌రావు ఉన్నారు.

సీతారామ జలాల కోసం ఉద్యమం

ఇల్లెందు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గిరిజన ప్రాంతాలకు సాగు-తాగునీరు అందించిన పిదపనే ఖమ్మం జిల్లాకు సీతారామ ప్రాజెక్టు జలాలు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రేపాకుల శ్రీనివాస్ స్పష్టం చేశారు. శుక్రవారం ఇల్లెందు సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు కొత్త డిజైన్ ద్వారా భద్రాద్రి జిల్లాకు తీవ్ర నష్టం జరిగిందని వివరించారు. గిరిజన ప్రాంతాలకు సాగునీరు అందించకుండా సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలు తరలించడం ద్రోహమన్నారు. సీతారామ ప్రాజెక్టు జలాల సాధనకోసం ఈ నెల 25న కొత్తగూడెంలో జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్టు, అన్ని వర్గాల ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ నాయకులు అబ్దుల్ నబీ, ఆలేటి కిరణ్, తాళ్లూరి క్రిష్ణ, వజ్జ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

మిర్చికి ధరాఘాతం!

(5వ పేజీ తరువాయి)

దారుణంగా పడిపోయింది. గతేడాదితో పోలిస్తే క్వింటాలుకు రూ. 5 వేలకు పైగా వ్యత్యాసం ఉంది. పోయినేడాది సీజన్‌లో క్వింటాలుకు రూ.18 వేల నుంచి రూ. 20 వేల వరకు ఉన్న మిర్చి ధర... ప్రస్తుతం రూ.12 వేల నుంచి రూ.13,500 వరకు పలుకుతోంది. క్వింటాలుకు కనీసం రూ.5 వేలు నష్టపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

లక్ష ఎకరాల్లో సాగు

రెండు తెలుగు రాష్ట్రాల్లో మిర్చిసాగులో గుంటూరు తర్వాత ఉమ్మడి ఖమ్మం జిల్లాకు పేరుంది. గోదావరి నది పరీవాహకంతోపాటుసాగర్ కాలువ ఆయకట్టు పరిధిలో మిర్చిసాగును ప్రతిఏటా క్రమం తప్పకుండా చేస్తారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో మిర్చి విస్తారంగా పండుతుంది. ప్రతిఏటా ఎకరానికి రూ.25వేల నుంచి రూ.35 వేలకు పైగా కౌలు చెల్లించి సాగుచేయడం ఆనవాయితీ. ఎకరం సాగుచేసే రైతులకు దుక్కులు, విత్తనాలు, ఎరువులు, పైపాట్లు, పురుగుమందులు, మిర్చికోతలు, గ్రేడింగ్, బస్తాల్లో తొక్కి మార్కెట్‌కు తరలింపు అన్నీ పెట్టుబడితో కూడుకున్న పని. ఎకరం సాగుచేయాలంటే రూ.75వేల నుంచి లక్షా 25వేలకు పైగా రైతులు పెట్టుబడి పెడుతున్నారు.



ధరలు తగ్గినప్పుడు పెట్టుబడులు రావడం కూడా కష్టమేనని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం మిర్చి రైతు పరిస్థితి డోలాయమానంలో ఉంది. సీజన్ ప్రారంభంలో రూ.15 వేల వరకు ధర ఉండగా, ఇప్పుడు రూ.13,300 జెండాపాట నడుస్తోంది. ప్రస్తుతం మిర్చి సీజన్ చివరి దశలో ఉండడంతో నాణ్యతలేదని తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. ఈ పరిస్థితి మిర్చి రైతును కుంగదీస్తోంది. క్వింటాలుకు రూ.20వేల పైన ధర ఉంటుందని భావించి సాగుచేసిన రైతులకు ధర లేకపోవడం, పెట్టుబడులు భారం కావడంతో దిగులు పడుతున్నారు. విదేశాలకు ఎగుమతులు లేకపోవడమే ధర లేకపోవడానికి కారణమని రైతులు చెబుతున్నారు. చైనా, బంగ్లాదేశ్, మలేషియా, సింగపూర్, ఇండోనేషియా, తైవాన్, శ్రీలంక తదితర దేశాలకు ప్రతి ఏటా మిర్చి ఎగుమతి అవుతుంది.

ఎన్నాళ్లీ కన్నీళ్లు!?

(5వ పేజీ తరువాయి)

పాల్వంచ కొత్తగూడెం, ములకలపల్లి, జూలూరుపాడు మండలాల మీదుగా సింగరేణి మండలం చీమలపాడు గుట్టల్లో టెన్నెల్ ద్వారా ఇల్లెందు నియోజకవర్గానికి గోదావరి జలాలు అందించేందుకు తొలుత డిజైన్ చేశారు. తాళ్లగూడెం వద్ద లిఫ్టు ఏర్పాటు చేసి గాదెపాడు, రాగబోయినగూడెం చెరువులను నింపడం అక్కడి నుంచి రోళ్లపాడు రిజర్వాయర్ నింపి మరో లిఫ్టు ద్వారా బోడు, ఇల్లెందు రోపెండు, ఇల్లెందులపాడు, కొమరారం చెరువులను నింపడం లక్ష్యంగా డిజైన్ చేశారు.

అదేవిధంగా కోమట్లగూడెం వద్ద మరో కెనాల్ ఏర్పాటు చేసి కారేపల్లి మండలం మీదుగా నిజాంపేట, ఎర్ర చెరువు, గార్ల చెరువులను గోదావరి జలాలతో నింపడం గార్లలో లిఫ్టు ఏర్పాటు చేసి అక్కడి నుంచి బయ్యారం చెరువు నింపడానికి డిజైన్ చేశారు. ఈ క్రమంలో ఇల్లెందు నియోజకవర్గంలోని తాళ్లగూడెం రాఘబోయినగూడెం, గాదెపాడు, మద్దిరాల, నిజాంపేట, గార్ల వద్ద ఆరు లిఫ్టులు ఏర్పాటు చేసి గోదావరి జలాలతో ఇల్లెందు నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తామని ప్రకటించారు. అదే క్రమంలో గార్ల మండలం మీదుగా డోర్నకల్, మహబూబాబాద్, ఖమ్మం నియోజకవర్గాలకు గోదావరి జలాలు అందించే రీతిలో ప్రాజెక్టు రూపకల్పన చేశారు.

అయితే సీతారామ జలాలు ముందుకెళ్లి చీమలపాడు టెన్నెల్ ద్వారా వెనకకు రావడం, ఇల్లెందు ప్రాంతం గోదావరి నదికి ఎగువ భాగాన ఉండటంతో జలాలు అందించడానికి ఆరు ఎత్తిపోతల పథకాలకు రూపకల్పన చేశారు. తదుపరి అదనపు ఆయకట్టుతో రీడిజైన్ చేశారు. ఇల్లెందు నియోజకవర్గంలో 69,996 ఎకరాలు, పినపాక నియోజకవర్గంలో 15,796 ఎకరాలు, వైరా నియోజకవర్గంలో 22,008 ఎకరాలు ఖమ్మం నియోజకవర్గంలో 7,063 ఎకరాలు అశ్వారావుపేట నియోజకవర్గంలో 1,075ఎకరాలు, డోర్నకల్ నియోజకవర్గంలో 263ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందించాలని రూ.3571 కోట్ల వ్యయ ప్రతిపాదనలతో మరో మారు ప్రణాళిక రూపొందించారు. ఈ మేరకు సర్వే కూడా జరిపారు. అయితే ఈ ప్రణాళిక అంతా సవ్యంగా సాగడానికి పాత అలైన్‌మెంట్‌లో చీమలపాడు టన్నెల్ కీలకంగా మారింది. కానీ అటవీ అభ్యంతరాలు చూపుతూ చీమలపాడు గుట్టల నుంచి టన్నెల్ ద్వారా గోదావరి జలాలు అందించే ప్రక్రియ నిలిచిపోయింది.

కేవలం వర్షాల పైనే ఆధారపడిన ఏజెన్సీ మండలాల రైతుల్లో ఈ పరిణామం తీవ్ర ఆగ్రహానికి కారణమవుతోంది. చుక్కనీరు లేని ఏజెన్సీకి సాగునీరు ఇవ్వకుండా సాగర్ జలాలతో ఆయకట్టు స్థిరీకరణ జరిగిన ప్రాంతాలకే సీతారామ జలాలను మళ్లించడం పట్ల ఏజెన్సీ రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పైగా రెండో దశ రీ డిజైన్ క్లియరెన్స్‌కు బడ్జెట్ కేటాయింపులు లేకపోవడం, డీపీఆర్ ఆమోదం పొందకపోవడం లాంటి పరిణామాలతో గిరిజన మండలాలకు గోదావరి జలాలు అందడం మిథ్యగా మారింది. భద్రాద్రి జిల్లాలోని భద్రాచలం పినపాక, ఇల్లెందు, కొత్తగూడెం నియోజకవర్గాల గిరిజన ప్రాంతాల భూములకు సాగునీరు అందించేందుకు కనీసం ఆయకట్టు కాల్వలు కూడా తవ్వకాలు జరపని దుస్థితి నెలకొంది.

మరోవైపు మెయిన్ కెనాల్ నుంచి ఏన్కూర్ ఏరియాలోని 52వ రెగ్యూలేటర్ వద్ద నుంచి నాగార్జునసాగర్ కెనాల్‌కు నీటి విడుదల ప్రారంభించారు. ఈ పరిణామం గిరిజనుల్లో తీవ్ర ఆగ్రహావేశాలకు కారణమైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భూములకు చుక్కసాగు నీరు అందించకుండా నేరుగా సాగర్ ఆయకట్టు భూములకు గోదావరి జలాలు మళ్లించడం పట్ల తీవ్ర నిరసన వ్యక్తం అవుతుంది.

ఇల్లెందు నియోజకవర్గంలోనే సీతారామ ప్రాజెక్టు శంకుస్థాపన జరిగినప్పటికీ అది ఎలా మార్పులకు గురైందో.. ఎవరి ఒత్తిళ్లతో దారి మళ్లిందో... రీ డిజైన్లకు ఎవరు కారకులో అనేది మాత్రం తేటతెల్లం కావడం లేదు. నాగార్జున సాగర్ జలాలు పారుతున్న సాగు భూములకే గోదావరి జలాలను మళ్లించడం, చుక్కనీరు లేని గిరిజన ప్రాంతాలకు అందించక పోవడాన్ని ఏజెన్సీ రైతులు ఆక్షేపిస్తున్నారు. ఈ క్రమంలోనే రైతులకు వెన్నుదన్నుగా వివిధ రాజకీయ పార్టీలు, సంఘాల నాయకులు ఉద్యమకార్యాచరణకు సిద్ధమవుతున్నారు.

భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

ఖమ్మం ఖానాపురంహవేలి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): సర్వ మానవాళికి సిలువ మరణం ద్వారా రక్షణ కల్పించిన రోజైన గుడ్‌ఫ్రైడేను శుక్రవారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. జిల్లాలోని అన్ని క్రైస్తవ ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలో విశ్వాసులు శాంతి ర్యాలీ నిర్వహించారు.

వైరా రోడ్‌లోని నార్త్ పారిస్ చర్చి నుంచి ర్యాలీని ఆర్‌సీఎం బిషప్ సగిలి ప్రకాష్ ప్రారంభించారు. అనంతరం ర్యాలీ ఇల్లెందు క్రాస్ రోడ్డు కరుణగిరి ప్రార్థనా మందిరానికి చేరుకుంది. సుమారు 2వేల మంది ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీలో ఫాదర్‌లు సురేష్, మాథ్యూ వరప్రసాద్, ఆంటోని పాల్గొన్నారు.

తరుగు.. తగవు..

- రబీ ధాన్యంలో కోత పెడుతున్న మిల్లర్లు
- తాలు, చెత్త పేరుతో తగ్గింపు
- తరుగు మాట ఎత్తవద్దని మంత్రి, కలెక్టర్ ఆదేశాలు
- అయినా పట్టించుకోని కొనుగోలుదారులు
- ప్రశ్నిస్తే మిల్లుల ముందు పడిగాపులే..

వైరా, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నాణ్యత లేదనే సాకుతో మిల్లర్లు అడ్డగోలుగా రైతుల ధాన్యంలో తరుగు కింద కోత పెడుతున్నారు. దాంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఓ వైపున రాష్ట్ర ప్రభుత్వం, జిల్లాకు చెందిన రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ రైతుల ధాన్యంలో తరుగు కోత పెడితే మిల్లర్లపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించినప్పటికీ వాటిని ఏమాత్రం ఖాతర్ చేయడం లేదు. క్వింటా ఒక్కింటికి మూడు నుంచి ఐదు కిలోల చొప్పున ధాన్యం తరుగు పేరిట కోత పెడుతున్నారు. ప్రస్తుతం గరికపాడు సొసైటీ పరిధిలో జరుగుతున్న ధాన్యం కొనుగోళ్లలో ఈ పరిస్థితి చోటుచేసుకుంది.

వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ మిల్లర్లకు ఫోన్ చేసి రైతుల ధాన్యంలో తరుగు తీయవద్దని స్పష్టంచేశారు. గరికపాడు సొసైటీ పరిధిలో రబీలో సాగుచేసిన ధాన్యాన్ని గత వారంరోజుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికే 25వేల బస్తాల ధాన్యాన్ని కొనుగోలు చేసి ఖమ్మం, నేలకొండపల్లి మండలం పైనంపల్లిలోని మిల్లులకు ఎగుమతి చేశారు. అయితే అక్కడ ఈ ధాన్యాన్ని దిగుమతి చేసుకొనేందుకు మిల్లర్లు పేచీ పెట్టారు. చివరికి రైతులు ప్రజాప్రతినిధులను ఆశ్రయించి వారి ద్వారా పేచీ పెట్టిన ధాన్యాన్ని దిగుమతి చేయించారు. ధాన్యం తరుగు లేకుండా తమకు మిల్లర్లు డబ్బులు చెల్లించే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

తాలు, చెత్తాచెదారం సాకుతో..

రబీలో పండించిన దొడ్డురకం ధాన్యంలో తాలు, చెత్తాచెదారం ఉందనే సాకుతో తరుగు కోసం మిల్లర్లు రైతులపై ఒత్తిడి తెస్తున్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు వచ్చిన లారీల్లోని ధాన్యాన్ని దిగుమతి చేసుకోకుండా కొనుగోలు కేంద్రాల ఏజెన్సీల వారితో బేరసారాలు నడుపుతున్నారు. క్వింటా ఒక్కింటికి మూడు నుంచి ఐదుకిలోల వరకు తరుగుదలకు రైతులను ఒప్పించాలని ఏజెన్సీల వారిపై ఒత్తిడి తెస్తున్నారు. దాంతో ఎలాగోఅలాగా లారీల్లో వెళ్లిన ధాన్యాన్ని మిల్లుల్లో దిగుమతి చేసేందుకుగానూ ఏజెన్సీ నిర్వాహకులు రైతులను బుజ్జగిస్తూ తరుగు తీసుకునేందుకు ఒప్పిస్తున్నారు. ఖమ్మంలోని ఓ రైస్ మిల్లు వద్ద ఆరు లారీల్లో వెళ్లిన ధాన్యం దిగుమతి కాకుండా నిలిచిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందారు. ఆవెంటనే ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్లి తమ గోడు వెలిబుచ్చుకున్నారు.

స్పందించిన ఎమ్మెల్యే

గరికపాడు, ముసలిమడుగు రైతులు శుక్రవారం వైరాలోనే ఉన్న ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌ను కలిసి తమ గోడును విన్పించారు. ఆ వెంటనే స్పందించిన ఎమ్మెల్యే మిల్లర్లకు ఫోన్ చేసి ఎట్టి పరిస్థితుల్లోనూ రైతుల ధాన్యంలో తరుగు తీయ్యవద్దని, యథావిధిగా దిగుమతి చేసుకోవాలని స్పష్టంచేశారు. ఈ క్రమంలో ఖమ్మానికి చెందిన రైస్‌మిల్లర్ తమ సాధకబాధకాలను ఎమ్మెల్యేకు ఏకరువు పెట్టినట్లు సమాచారం. ప్రభుత్వానికి సీఎంఆర్ కింద ఇచ్చే లెవీ బియ్యం బరువులో తేడా వస్తున్నందున, రబీలో పండించిన ధాన్యంలో తాలు, చెత్త ఉండటం వలన ధాన్యం తరుగు తప్పదన్నట్లుగా సదరు మిల్లర్ మాట్లాడారు. అయితే ఎమ్మెల్యే రైతుల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఇదే సమస్యపై కొంతమంది రైతులు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కార్యాలయ నిర్వాహకులను కలిశారు. వెంటనే మంత్రి కార్యాలయం నుంచి సదరు మిల్లర్లకు ఫోన్ చేసి రైతులను ఇబ్బంది పెట్టకుండా ధాన్యం దిగుమతి చేసుకోవాలని స్పష్టం చేశారు. వారంరోజుల నుంచి ఓవైపున పగలు తీవ్ర ఎండలు మరోవైపున రాత్రివేళ భారీ ఈదురుగాలులతో హఠాత్తుగా వర్షాలు కురుస్తుండటంతో రైతుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఇది చాలదన్నట్లు ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోకుండా ధాన్యంలో కోతలు మిల్లర్లు విధిస్తుండటంతో రైతుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గన్నీసంచుల కొరత మరోవైపు వేధిస్తోంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు ధాన్యంలో కోతలు లేకుండా సకాలంలో వాటిని దిగుమతి చేసుకొనేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

క్రైం సమాచారం

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



బోనకల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందాపురం (ఎల్) గ్రామంలో గురువారం ఓ వ్యక్తి క్రిమి సంహారక మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. గోవిందాపురం గ్రామానికి చెందిన ఇసంపల్లి సైదా(30) ట్రాక్టర్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఫైనాన్స్‌లో అప్పు తీసుకోవడంతో ఇటీవల కొన్ని కిస్తీలు పెండింగ్ పడ్డాయి. కంపెనీ వారు డబ్బులు కట్టాలని ఒత్తిడి చేయడంతో కొన్ని రోజుల్లో చెల్లిస్తానని చెప్పాడు. వారికి డబ్బులు చెల్లిస్తానని చెప్పిన గడువు ముగియడంతో ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నాడు. దీంతో ఫైనాన్స్ కంపెనీ వారు గ్రామంలోని కొంత మందికి ఫోన్లు చేసి డబ్బులు చెల్లించనందున ట్రాక్టర్ తీసుకెళ్తామని చెప్పారు. ఈ సమాచారం సైదాకు తెలియడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. క్రిమి సంహారక మందు సేవించాడు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య ఉంది. ఈ సంఘటన పై కుటుంబ సభ్యుల ఫిర్యాదు చేయగా ఎస్ఐ మధుబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యం

తిరుమలాయపాలెం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడిదపల్లిలో వ్యవసాయబావిలో గుర్తుతెలియని యువకుడి(35)మృతదేహం శుక్రవారం లభ్యమైంది. మేడిదపల్లి గ్రామపరిసర ప్రాంతాల్లో గత కొన్నిరోజులుగా గుర్తుతెలియని యువకుడు సంచరిస్తున్నాడు. ఆయువకుడు మతిస్థిమితం కూడా సరిగా లేదని గ్రామంలోజరిగే శుభకార్యాల వద్ద భోజనం చేస్తూ గ్రామంలో తిరుగుతుండేవాడు. శుక్రవారం ఓ రైతు వ్యవసాయబావిలో మృతదేహం పడి ఉండడం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్ఐ జగదీష్ ఆధ్వర్యంలో వివరాలు సేకరించారు. అన్నం ఫౌండేషన్‌కు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు వయస్సు35 ఏళ్ల ఉంటుందని ఎరుపురంగు టీషర్టు, బ్లాక్ రంగుచొక్కా ధరించాడని ఆచూకి తెలిసిన వారు పోలీసులను సంప్రదించాలని కోరారు.

ఒకే ఊరిలో ఇద్దరి బలవన్మరణం

చర్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) చర్ల మండలంలో శుక్రవారం ఇద్దరు వ్యక్తులు వేర్వేరు ప్రాంతాల్లో కారణాలతో ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. వరంగల్ చెందిన గెడెం కమల్ హాసన్ (45) కలివేరు గ్రామానికి చెందిన మహిళను వివాహం చేసుకుని గ్రామంలో జీవిస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. చర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

. అలాగే చర్ల మండలం అంబేద్కర్ నగర్‌చెందిన తాటి రమణయ్య (40) అంబేద్కర్ శివారులో ఉన్న బావిలో దూకి శుక్రవారం ఉదయం ఆత్మహత్య చేసుకున్నాడు. గత కొద్ది రోజులుగా ఇంట్లో గొడవలు జరుగుతున్నట్లు స్థానికులు తెలిపారు. ఇదే క్రమంలో రమణయ్య ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. చర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

అశ్వాపురం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామానికి చెందిన బండి అనిల్(34) అనేయువకుడు చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న అనిల్ గత కొంతకాలంగా అనారోగ్యానికి గురయ్యాడు. ఈనేపథ్యంలో మనస్తాపానికి గురయి రెండురోజుల క్రితం ఇంటినుంచి వెళ్లిపోయాడు. కుటుంబసభ్యులు ఈవిషయమై అశ్వాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా ఇంటినుంచి వెళ్లిన అనిల్ తుమ్మలచెరువు వెళ్లే రహదారి సమీపంలోని ఊరవాయి కాలువ సమీపంలో చెట్టుకు ఉరివేసుకున్నాడు. శుక్రవారం పశువుల కాపరులు గమనించి గ్రామస్థులకు తెలపటంతో కుటుంబ సభ్యులు అనిల్‌గా గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వటంతో అశ్వాపురం సీఐ అశోక్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహం కుళ్లిపోవటంతో సంఘటన స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించారు. భార్య సాయిశ్రీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.మృతునికి కూతురు,కుమారుడు ఉన్నారు.

భూవివాదంలో ఇరువర్గాలపై కేసు

అశ్వాపురం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామంలో ఈనెల 10న జరిగిన భూవివాదం కేసులో శుక్రవారం ఇరువర్గాలపై కేసు నమోదైంది. రామచంద్రాపురం గ్రామంలో 190/1సర్వేనెంబరులోని ఎకరం ఇరవై గుంటల భూమికి సంబంధించి గ్రామస్థులకు, సారపాకకు చెందిన కనకమేడల హరిప్రసాద్ కుటుంబ సభ్యులకు మధ్య వివాదం నెలకొని గ్రామంలో ఉద్రిక్తతకు దారితీసిన సంగతి తెలిసిందే. ఇరువర్గాలు అదేరోజు అశ్వాపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారించిన సీఐ అశోక్‌రెడ్డి ఇరువర్గాలపై కేసులు నమోదు చేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బూర్గంపాడు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టరును శుక్రవారం బూర్గంపాడు పోలీసులు పట్టుకున్నారు. బూర్గంపాడు మండల పరిధిలోని మోతె పట్టీనగర్ శివారు గోదావరి నుంచి ఇసుకను తరలిస్తున్నారనే సమాచారంతో పోలీసులు దాడులు చేపట్టారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టరును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టరు డ్రైవరు, యాజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

కారును ఢీకొట్టిన కంటైనర్



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

జూలూరుపాడు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కారును కంటైనర్ ఢీకొట్టిన సంఘటన జూలూరుపాడులోని ఉపమార్కెట్ యార్డ్ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. భద్రాచలానికి చెందిన చేతన్ తన సోదరిని పరీక్ష రాయించేందుకు కారులో భద్రాచలం నుంచి ఖమ్మం తీసుకెళుతున్నాడు. ఈ క్రమంలో తల్లాడ నుంచి జూలూరుపాడు వైపు వస్తున్న కంటైనర్ ఉపమార్కెట్ యార్డ్ సమీపంలో ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టింది. ఎయిర్‌బెలూన్స్ ఓపెన్ కావడంతో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలు కాలేదు. కారు పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. కారును ఢీకొట్టి కంటైనర్ డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోయాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంబడించి సాయిబాబా ఆలయ సమీపంలో దానిని పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ బాదావత్ రవి సందర్శించి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. దెబ్బతిన్న కారును పరిశీలించారు.

7.63 కిలోల గంజాయి పట్టివేత

భద్రాచలం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని నెల్లిపాక రోడ్డు వద్ద 7.63 కిలోల ఎండు గంజాయిని ఎక్సైజు ఎన్‌ఫోర్సుమెంటు అధికారులు పట్టుకున్నారు. శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా శుక్రవారం మధ్యప్రదేశ్‌కు చెందిన బ్రిజేష్ చింతూరు నుంచి గంజాయిని కొనుగోలు చేసి తీసుకొస్తుండగా వాహన తనిఖీల్లో పట్టుబడ్డాడు. అతని వద్ద ఒక సెల్‌ఫోను స్వాధీనం చేసుకున్నారు. అలాగే మరో కేసులో బూర్గంపాడుకు చెందిన గుండె రాజేష్, సంతోష్ బైకుపై 10 లీటర్ల నాటుసారాను సారపాకకు తరలిస్తుండగా పట్టుకున్నారు. ఈ దాడుల్లో ఎక్సైజు శాఖ అధికారులు కె..తిరుపతి, సిబ్బంది కరీం, సుధీర్, హరీష్, వెంకట్, హనుమంతరావు పాల్గొన్నారు.

రైతుల సమస్యల సాధనలో 'భూ భారతి' ఓ మైలురాయి

» ప్రభుత్వ సంక్షేమమే ప్రజా ప్రభుత్వ అంతిమ లక్ష్యం

» కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి. పాటిల్

పినపాక/ కరకగూడెం ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టం రైతుల సమస్యల సాధనలో ఓ మైలు రాయి అని, ప్రభుత్వ సంక్షేమమే ప్రజా ప్రభుత్వ అంతిమ లక్ష్యమని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. పినపాక మండలం ఏడూళ్ల బయ్యారం క్రాస్ రోడ్డు జీవీఆర్ ఫంక్షన్ హాలులో శుక్రవారం నిర్వహించిన భూ భారతి చట్టం 2025 అవగాహణ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. భూ భారతి చట్టంలోని మాడ్యూల్స్, ఆప్షన్సను వివరంగా కార్యక్రమానికి హాజరైన రైతులకు వివరించారు. రైతులు లేవనెత్తిన అనేక సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గుడ్ ఫ్రైడే రోజున భూ భారతి అవగాహన సదస్సును రైతుల సమక్షంలో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం పినపాక మండలం పొట్లపల్లి గ్రామానికి చెందిన 42 కుటుంబాలు పోడు భూముల సమస్యల పై కలెక్టర్ జితేష్ వి. పాటిల్‌కి, ఎమ్మెల్యేకు వినతిపత్రం అందచేశారు. గిరిజన ఆదివాసీ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలోజిల్లా కలెక్టర్‌కు పలు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. గిరిజన చట్టాలకు ఇబ్బంది అయ్యే చర్యలను విరమించుకోవాలని కోరారు.

కరకగూడెం జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో భూ భారతి పోర్టల్ అమలులో భాగంగా భూ భారతి చట్టం 2025 అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ జితేష్ వి. పాటిల్, భద్రాచలం ఆర్డీవో దామోదర్ మాట్లాడారు. ప్రజలు భూముల విషయంలో ఎలాంటి సమస్యలు ఏర్పడిన సంవత్సరం కాలంలో పరిష్కరించుకోవడానికి భూ భారతి చట్టం ద్వారా అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. భూ సమస్యలపై ప్రజలు గతంలో కోర్టులను ఆశ్రయించే వారని.. నేడు కోర్టులను ఆశ్రయించకుండానే షెడ్యూల్(ఏ)ను ఏర్పాటు చేసిన ప్రభుత్వం భూమి విలువ రూ, 5లక్షల లోపు ఉంటే ఆర్డీవో స్థాయి, రూ, 5లక్షలపైగా ఉంటే కలెక్టర్ స్థాయిలో సమస్యలను పరిష్కరిండానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమానికి భద్రాచలం ఆర్డీవో దామోదర్, అగ్రికల్చర్ ఏడీఏ తాతారావు, పినపాక తహసిల్దార్ నరేష్, ఎంపీడీవో సునీల్‌కుమార్, ఎంపీవో వెంకటేశ్వరరావు, ఏవో వెంకటేశ్వర్లు, ఐకేపీ ఏపీఎం జ్యోతి, ప్రభుత్వ అధికారులు, పినపాక మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రైతుల్లో అభద్రతా భావాన్ని తొలగించటమే లక్ష్యం

» ఖమ్మం ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీజ



తహసీల్దార్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీజ

నేలకొండపల్లి, ఏప్రిల్18 (ఆంధ్రజ్యోతి): భూసమస్యల శాశ్వత పరిష్కారానికే ప్రభుత్వం కొత్త ఆర్ఓఆర్ చట్టం భూభారతి-2025ను తెచ్చిందని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ డాక్టర్ శ్రీజ చెప్పారు. మండల పరిధిలోని చెర్వుమాధారం, కొత్తకొత్తూరు గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన భూభారతి అవగాహనా సదస్సులను శ్రీజ పరిశీలించారు. సదస్సుల్లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ, నిర్వహిస్తున్న రిజిష్టర్లు, దరఖాస్తుదారులకు రశీదులు ఇస్తున్నారా? ఏయే సమస్యలపై ఎక్కువగా దరఖాస్తులు వస్తున్నదీ పరిశీలించారు. సదస్సులో సమస్యలపై దరఖాస్తులు ఇవ్వటానికి వచ్చిన రైతులతో మాట్లాడారు. అనంతరం డాక్టర్ శ్రీజ రైతులతో మాట్లాడుతూ ధరణితో రైతుల్లో ఉన్న అభద్రతాభావాన్ని తొలగించటమే లక్ష్యంగా ప్రభుత్వం భూభారతి చట్టం తెచ్చిందన్నారు. కొత్త చట్టంతో అనేక రకాల సేవలు అందించటం సులభతరం అవుతుందన్నారు.

వంట చేస్తుండగా అగ్నిప్రమాదం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్18 (ఆంధ్రజ్యోతి): గుడ్‌ఫ్రైడే సందర్భంగా ఓ ఇంట్లో వంట చేస్తుండగా గ్యాస్ సిలిండర్ ద్వారా మంటలు వ్యాపించి అగ్ని ప్రమాదం చోటుచేసుకున్న సంఘటన శుక్రవారం సత్తుపల్లి పట్టణంలో చోటుచేసుకుంది. సీఎస్ఐ చర్చి ఎదుట నివాసం ఉంటున్న బాధితుడు అలవాల ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం... వంట చేస్తుండగా మంటలు ఒక్కసారిగా వ్యాపించి కిచెన్ రూమ్‌లో వ్యాపించి అగ్నిప్రమాదం జరిగిందన్నారు. భయభ్రాంతులకు గురైన తాము స్థానికుల సహాయంతో మంటలను అదుపు చేస్తుండగా సత్తుపల్లి ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో వెంటనే సిబ్బంది చేరుకున మంటలను పూర్తిగా ఆర్పివేశారని చెప్పారు. ఈ ప్రమాదంలో కిచెన్‌లోని వంటసామగ్రి, సరుకులు పూర్తిగా దగ్ధమవ్వగా విద్యుత్ స్విచ్‌బోర్డులు సైతం కాలిపోయాయి. కాగా సుమారు రూ.3లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లగా రూ.10లక్షల వరకు ఆస్తినష్టం జరగకుండా కాపాడినట్లు అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు.

ఇంటి తాళాలు పగలగొట్టి చోరీ

దమ్మపేట, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడిన ఘటన దమ్మపేటలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. దమ్మపేటకు చెందిన తాండ్ర నర్సింహారావు కుటుంబ సభ్యులతో కలిసి రెండు రోజుల క్రితం బంధువుల ఇంటికి వెళ్లారు. శుక్రవారం ఇంటికి వచ్చి తులుపు తీసే క్రమంలో తాళాలు పగలగొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా వెండి వస్తువులు పోయినట్లు గుర్తించారు. వెంటనే దమ్మపేట పోలీస్‌స్టేషన్‌లో నర్సింహారావు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు ఎస్ఐ సాయికిషోర్ రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. రూ.20వేల విలువగల వెండి వస్తువులు చోరీకి గురయ్యాయని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అమ్మకు ఎంత కష్టం...

» ఒంటరిగానే కుటుంబ పోషణ

» కుమారులిద్దరికి మానసిక వైకల్యం

» బావిలో పడి పెద్ద కుమారుడి మృతి



తల్లి, ముగ్గురు పిల్లలు(ఫైల్), సర్కిల్‌లో మృతుడు యాకుబ్

బోనకల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అన్నింటిని భరించే శక్తి అమ్మకు మాత్రమే ఉంటుంది. విధి భరించలేని కష్టాలను తలరాతగా ఇచ్చినా కుంగిపోలేదు. జీవితాంతం తోడునీడగా ఉంటాడనుకున్న భర్త వదిలేసినా భరించింది. కడుపున పుట్టిన బిడ్డలిద్దరూ మానసిక వైకల్యంతో ఉన్నా పేగు బంధానికి కట్టుబడి దూర ప్రాంతంలో సంచారం జీవనం సాగిస్తూ కుటుంబాన్ని పోషిస్తుంది. కాని అనుకోని విధంగా వ్యవసాయ బావిలో పడి పెద్ద కుమారుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం వెలుగులోకి రావడంతో కుంగిపోయింది. కనీసం కుమారుడి మృతదేహాన్ని సొంతూరుకు తరలించేందుకు కూడా స్థోమత లేని దయనీయ పరిస్థితి ఆమెది కావడంతో దాతలు మానవత్వం చూపి ఆర్థిక సాయం చేశారు.

వివరాల్లోకి వెళ్తే వరంగల్ జిల్లా స్టేషన్ ఘనపూర్‌కు చెందిన షేక్ రేష్మాకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుమార్తె మినహా ఇద్దరు కొడుకులకు మానసిక వైకల్యం ఉంది. భర్త వదిలేయడంతో బతుకు దెరువు కోసం చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామానికి 8 నెలల క్రితం వలస వచ్చింది. గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో గుడారం వేసుకొని ముగ్గురు పిల్లలతో కలిసి ఉంటుంది. పాత రాతిండి సామగ్రి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. పెద్ద కుమారుడు షేక్ యాకుబ్ (15) అభం శుభం తెలియని మాటలతో అందరికి వినోదాన్ని పంచేవాడు గ్రామంలో ఇళ్ల వద్దకు వెళ్లి వారు పెట్టిన భోజనాన్ని తల్లికి ఇస్తుండేవాడు. ఈ నెల 16వ తేదిన బయటకు వెళ్లిన యాకుబ్ తిరిగి రాలేదు. బోనకల్ మండలం లక్ష్మీపురం రెవెన్యూ పరిధిలోని చెరువు సమీపంలో గల వ్యవసాయ భావిలో పడి మృతి చెంది కనిపించాడు. ప్రమాదవశాత్తు కాలు జారి పడి మృతి చెంది ఉంటాడన్న చర్చ జరుగుతోంది. మృతదేహాన్ని పోస్టుమార్టర్ నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఎస్ఐ మధుబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

గంజాయి పట్టివేత

ఖమ్మం క్రైం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి వద్దనుంచి శుక్రవారం ఖమ్మం త్రీటౌన్ పోలీసులు 450 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మధిరకు చెందిన రాచకొండ దుర్గారావు గత కొంతకాలంగా ఖమ్మం నగరంలోని వెంకటేష్ నగర్‌లో నివాసముంటున్నాడు. తాను గంజాయి సేవించటానికి అలవాటుపడి తక్కువ ధరకు గంజాయిని కొనుగోలుచేసి విక్రయాలు కూడా జరుపుతున్నాడు. దీంతో ఎంబీ గార్డెన్స్ సమీపంలో పెట్రోలింగ్‌లో ఉన్న పోలీసులకు అనుమానస్పదంగా కనిపించటంతో అతణ్ని అదుపులోకి తీసుకొని తనిఖీచేయగా అతని వద్ద 450 గ్రాముల గంజాయి దొరికింది. దీంతో అతనిపై కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు. అదేవిధంగా గతంలోనూ దుర్గారావుపై కేసు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

పంచాయతీలో కాంట్రాక్ట్ బిల్ కలెక్టర్ తొలగింపు

భద్రాచలం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం గ్రామపంచాయతీలో కాంట్రాక్ట్ బిల్ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న పూసా జగదీష్‌ను విధులనుంచి శుక్రవారం తొలగించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో సొంతస్థలం ఉన్న వారికి ఇల్లు మంజూరుచేశారు. లబ్ధిదారుని ఇల్లు బేస్మెంట్ లెవల్ రాకున్నా, సరైన విచారణ చేయకుండా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశాడు. సాంకేతిక పరిజ్ఞానంతో విచారణలో ఇది తప్పుడు సమాచారం అని తేలినట్లు తెలిసింది. దీంతో జగదీష్‌ను విధుల నుంచి తొలగిస్తూ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఇలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. అవకతవకలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

భద్రాచలం ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానానికి చెందిన సిబ్బందిపై దూషణలకు, దాడికి పాల్పడ్డారని ఆరోపణలతో తెల్లం నరసింహారావు అనే వ్యక్తిపై భద్రాచలం పోలీసులు శుక్రవారం కేసునమోదు చేశారు. ఈవో కార్యాలయంలో గురువారం సాయంత్రం దక్షిణమధ్య రైల్వేలో పనిచేస్తున్న నరసింహారావు మద్యం మత్తులో దేవస్థానం సిబ్బందిపై దూషణలకు పాల్పడటమే కాకుండా దాడి చేశారని దేవస్థానం సిబ్బంది పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు కేసునమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ అనుమతులు రాగానే యూటీ పనులు

» రూ.14కోట్లతో ప్రతిపాదనలు

» ఇరిగేషన్ ఖమ్మం సర్కిల్ ఎస్ఈ మంగళపూడి వెంకటేశ్వర్లు

» పాలేరు ఎడమకాల్వ వద్ద పనుల పరిశీలన



సాగర్ ఎడమకాల్వ పనులు పరిశీలిస్తున్న ఎస్ఈ

కూసుమంచి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పరిపాలన అనుమతులు రాగానే సాగర్ ఎడమకాల్వ అండర్ టన్నెల్ పనులు, లైనింగ్ పనులు ప్రారంభిస్తామని ఇరిగేషన్ శాఖ ఖమ్మం సర్కిల్ ఎస్ఈ మంగళపూడి వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం కూసుమంచి మండలం పాలేరు వద్ద సాగర్ ఎడమకాల్వకట్ట మట్టిపనులు, నాయకన్‌గూడెం వద్ద గెస్ట్‌హౌజ్ మరమ్మతులను ఆయన పరిశీలించారు. గత ఏడాది సెప్టెంబరు 1న వచ్చిన పాలేరు వరదల కారణంగా 140 కిలో మీటరు వద్ద కాల్వకు గండి పడిన విషయం తెలిసిందే. ఈక్రమంలో పనులను తాత్కాలికంగా పూర్తి చేసి నీరందించినట్లు పేర్కొన్నారు. అయితే శాశ్వత ప్రాతిపదికన అండర్ టన్నల్ నిర్మాణంతో పాటు, బ్రిడ్జివరకు కాల్వ లైనింగ్‌కు రూ.14కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు. అనుమతులు రాగానే వచ్చేవానాకాలం నాటికి పనులు పూర్తిచేసి నీరందించేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం వరదల కారణంగా కట్ట అక్కడక్కడ నెర్రెలు వచ్చాయని, వాటికి మట్టి పనులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఇదిలా ఉండగా పాలేరు జలాశయం నీటిమట్టాన్ని పరిశీలించారు. గరిష్ఠ నీటిమట్టం 23 అడుగులకు, 22 అడుగుల మేర నీరు నిల్వ ఉందని తెలిపారు. ఇటీవల గాలి దుమారానికి జలాశయం షట్టర్లు పడిపోయాయని, వాటిని లేపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ మదవి, ఏఈ శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బాహుబలి బయటకు వస్తే తట్టుకుంటారా?

» ఎమ్మెల్సీ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మధు



మాట్లాడుతున్న తాతా మధు

కొణిజర్ల,ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించే రజతోత్సవ బహిరంగసభ వేదికగా బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బయటకు రాబోతున్నాడు, తట్టుకోగలుగుతారా, ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చే వరకు కాంగ్రెస్‌ను కేసీఆర్ ఆధ్వర్యంలో ఎండగడతాం అని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మంజిల్లా అధ్యక్షుడు తాతా మధు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రామనర్సయ్యనగర్ గ్రామంలో ఇటీవల పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేసి ఆసుపత్రిలో చికిత్స పొంది తిరిగి ఇంటికి చేరుకున్న గ్రామానికి చెందిన జటపిట రవిని మరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం గ్రామంలో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలకు మోసపూరితమైన వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పై ప్రజలకు నమ్మకం పోయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు పోట్ల శ్రీనివాసరావు, కిలారు మాదవరావు, మాజీ సర్పంచ్ కొర్రా కాంతమ్మ, పోగుల శ్రీను, దొడ్డపినేని రామారావు, పాసంగులపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మండల పర్యటనలో భాగంగా మల్లుపల్లిలో రైతులు కల్లాల్లో ఆరబోసిన ధాన్యాన్ని ఎమ్మెల్సీ తాతా మధు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు నష్టం జరగకుండా ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు.

పెన్షన్ ఫండ్‌కు టన్ను బొగ్గుపై రూ.20 చెల్లింపు

» అంగీకరించిన సింగరేణి యాజమాన్యం

» వేజ్‌బోర్డు సభ్యుడు కొత్తకాపు లక్ష్మారెడ్డి



సీఎంపీఎఫ్‌వో సమావేశంలో పాల్గొన్న ట్రస్టు అధికారులు, సభ్యులు

ఇల్లెందు, ఏప్రిల్, 18(ఆంధ్రజ్యోతి): కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ ఆఫ్ ట్రస్టీ(సీఎంపీఎఫ్‌బీవోటీ) సమావేశంలో పెన్షన్‌ఫండ్‌ను బలోపేతం చేసేందుకు కోల్ ఇండియా నిర్ణయం మేరకు సింగరేణి కాలరీస్ యాజమాన్యం సైతం ఒక టన్ను బొగ్గుకు రూ.20 చొప్పునపెన్షన్‌ఫండ్‌కు జమ చేసేందుకు అంగీకరించిందని బీఎంఎస్ జాతీయ బొగ్గుగనుల వేజ్ బోర్డు సభ్యులు, సీఎంపీఎఫ్ ట్రస్ట్‌బోర్డు సభ్యుడు కొత్తకాపు లక్ష్మారెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం ఢిల్లీలో సీఎంపీఎఫ్ ట్రస్ట్ బోర్డు సమావేశం ఛైర్మన్ విక్రం దేవదత్ అధ్యక్షతన జరిగింది. ఈ మేరకు సమావేశ నిర్ణయాలను శుక్రవారం ఆయన విడుదల చేశారు. సమావేశంలో ట్రస్టు బోర్డు సభ్యులు బొగ్గుగని కార్మికుల కనీస పెన్షన్‌ను రూ.5వేలకు పెంచాలని, ఫ్యామిలీ పెన్షన్‌ను 1971 పెన్షన్ దారులకు ప్రస్తుతం ఉన్న పెన్షన్‌లను పెంచాలని కోరడంతో పరిశీలించేందుకు బోర్డు సభ్యులు అంగీకరించినట్లు తెలిపారు.

బాలుడిని ఢీకొన్న ట్రాక్టర్

జూలూరుపాడు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ఢీకొనడంతో మూడేళ్ల బాలుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని బేతాళపాడు గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే.. బొడ్డు మల్లికార్జున్‌త్రివేణి దంపతులకు చెందిన మూడేళ్ల కుమారుడు బొడ్డు సిద్ధునాయుడు ఇంటి సమీపంలోని తాతయ్య గోపు రామకృష్ణ వాళ్ల ఇంట్లో నుంచి ఇంటికి వెళ్లడానికి రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో రోడ్డుపై వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ సంఘటనలో బాలుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే వైద్య చికిత్సలు అందించేందుకు కుటుంబసభ్యులు కొత్తగూడెం ఆసుపత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం అందించేందుకు వైద్యుల సూచనలు మేరకు హైదారాబాద్ తరలించారు.

డీసీహెచ్ఎస్ రవిబాబుకు అంబేద్కర్ ఎక్సలెన్సీ అవార్డు



అవార్డు ప్రదానం చేస్తున్న దృశ్యం

చుంచుపల్లి, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో డీసీహెచ్ఎస్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ గుగులోత్ రవిబాబు నాయక్‌కు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఎక్సలెన్సీ అవార్డు వరించింది. శుక్రవారం హైదారాబాద్‌లోని రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి, కేంద్రమాజీ మంత్రి వేణుగోపాలచారి, దైవజ్ఞశర్మ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. మారుమూల ప్రాంతాలైన భద్రాద్రి జిల్లాలో రోగులు ఖమ్మం, వరంగల్ వైద్య సేవలు కోసం వెళ్లే పరిస్థితి నుంచి స్థానికంగానే అన్ని రకాల స్పెషాలిటీ సేవలు ఏర్పాటు చేసినందుకు ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు ప్రకటించారు.



స్వర్ణకవచాలతో దర్శనమిచ్చిన భద్రాద్రి రామయ్య



భద్రాచలం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని రామాలయంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారు శుక్రవారం స్వర్ణభద్రకవచాలతో భక్తులకు దర్శనమిచ్చేవారు. ఈ సమయంలో అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అలాగే స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణదారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, వేద ఆశీర్వచనంను వైదిక సిబ్బంది నిర్వహించారు.

ఏఐసీసీ ఇన్‌చార్జ్‌ని కలిసిన కాంగ్రెస్ నాయకులు

అశ్వారావుపేట, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ నాయకురాలు, రాష్ట్ర ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌ను శుక్రవారం అశ్వారావుపేటకు చెందిన జిల్లా కాంగ్రెస్ నాయకులు జేష్ఠ సత్యనారాయణ చౌదరి కలిశారు. శుక్రవారం హైదరాబాదులోని గాంధీభవన్‌లో మీనాక్షి నటరాజన్‌ను కలిసి జిల్లా, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బలోపేతం, ఇతర సమస్యలపైన ఆయన వినతి పత్రం అందజేశారు. సత్యనారాయణ చౌదరి కాంగ్రెస్ పార్టీ బలోపేతంపైన దృష్టి పెట్టాలని ఆమెను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గానికి చెందిన నాయకులు పాల్గొన్నారు.

వేదగణితంలో సాత్విక్ ప్రతిభ

అశ్వారావుపేట, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): వేదగణితం శిక్షణలో అశ్వారావుపేటకు చెందిన సాత్విక్ సాయి కుమారాచార్యులు ప్రతిభ కనబరిచి అందరి మన్నలను పొందారు. వాగ్దేవి కళాపీఠం, విశాఖపట్టణం వారు ఆరు నెలలుగా అంతర్జాతీయంగా అంతర్జాలంలో శిక్షణను ఇచ్చారు. శిక్షణ అనంతరం నిర్వహించిన పరీక్షలకు సంబంధించి పరీక్ష ఫలితాలను శుక్రవారం ప్రకటించారు. ఈ ఫలితాలలో సాయి సాత్విక్ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత అయి అత్యంత ప్రతిభను కనబరిచారు. దీనికి సంబంధించి ధృవీకరణ పత్రాన్ని మెయిల్ ద్వార వాగ్దేవి కళాపీఠం సాత్విక్‌కు పంపారు. కళాపీఠం వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ వెంపరాల వెంకట లక్ష్మి శ్రీనివాసమూర్తి, వేగ గణితం శిక్షకురాలు జి సత్యలు సాయి సాత్విక్ సాయికుమార్‌ను ఫోన్ ద్వార అభినందనలు తెలియజేసారు.

మినీ రిజర్వాయర్‌గా తీర్చి దిద్దాలి

బూర్గంపాడు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): బూర్గంపాడు మండల పరిధిలోని టేకులచెరువు గ్రామ సమీపంలో ఉన్న దోమలవాగు చెరువును మినీ రిజర్వాయర్‌గా తీర్చి దిద్దాలని కాంగ్రెస్ నాయకులు, ఆయకట్టు రైతులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లను కోరారు. శుక్రవారం ఎమ్మెల్యేను మణుగూరులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసారు. దోమలవాగు చెరువును మినీ రిజర్వాయర్‌గా చేస్తే మండల పరిదిలోని 11గ్రామాలకు చెందిన 1405ఎకరాలలోని రైతులకు లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రైతుల కోరిక మేరకు మేలు చేసేందుకు ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి రిజర్వాయర్ ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో వెంకటేశ్వర్‌రెడ్డి, విజయ్‌గాంధీ, నాగిరెడ్డి, సతీష్, నాగరాజు, నాగమణి, లక్ష్మీనారయణరెడ్డి, సీతారాం, పున్న, తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన

మణుగూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లంక మల్లారం గ్రామంలో పలువురుకి ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇల్లు మంజూరి అయ్యాయి. శుక్రవారం గ్రామంలో మంజూరైన ఇళ్లను నిర్మించుకుంటున్న లబ్ధిదారుల వద్దకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చేరుకుని ఇంటి నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణదారులతో మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం నిరుపేదలకు అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్లు పటిష్టంగా నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నవీన్, శివ సైదులు, గాండ్ల సురేష్, తరుణ్‌రెడ్డి, రహీం పాషా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వెంకట్రావు విస్తృత పర్యటన

దుమ్ముగూడెం ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మండలంలో శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. చిననల్లబల్లికు చెందిన సున్నం రాంబాబు ఇందిరమ్మ ఇంటికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఇటీవల గాలిదుమారానికి ఇళ్లు కూలిన శ్రీనగర్ కాలనీకు చెందిన జిలకర రమేష్, రామారావుపేటకు చెందిన కారం గోపాల్ కుటుంబాలను పరామర్శించారు. భద్రాచలం మార్కెటు కమిటీ ఛైర్మన్ తెల్లం సీతమ్మ, మాజీ జెడ్పీటీసీ అన్నె సత్యనారాయణమూర్తి, లంక అబ్బులు, పిలకా వెంకటరమణారెడ్డి, మట్టా శివాజీ, వర్సా చిన్నారావు, కొండపల్లి నరేంద్ర, అల్లాడి వెంకటేష్, అయ్యపురెడ్డి శ్రీధర్, కెల్లా శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మేడే స్ఫూర్తితో పోరాటం: టీయూసీఐ

ఇల్లెందు టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కార్మికులకు హక్కులు సాధించి పెట్టిన మేడే స్ఫూర్తితో పనిగంటల పెంపునకు వ్యతిరేకంగా పోరాడాలని టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి కే. సూర్యం కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. శుక్రవారం ఇల్లెందులో టీయూసీఐ జిల్లాకమిటి సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మికవర్గం పోరాడి 8గంటల పని దినం హక్కులు, సాధిస్తే నేడు బీజేపీ ప్రభుత్వం కార్మికుల శ్రమను కారుచౌకగా కార్పోరేట్ శక్తులకు దోచిపెడుతుందని ఆరోపించారు. సమావేశంలో జిల్లాకమిటి అధ్యక్షులు ఆర్. మధుసూధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి యాకూబ్ షావలి, సహాయ కార్యదర్శి నూపా భాస్కర్, ఉపాధ్యక్షులు గోపాల్‌రావు, కోశాధికారి పాయం వెంకన్న, జిల్లాకమిటీ సభ్యులు మల్లెల వెంకటేశ్వర్లు, గురునాథం, మల్సూర్, జాన్ తదితరులు పాల్గొన్నారు

ఆర్టీసీ బస్టాండ్‌లో మర్యాద దినోత్సవం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్/భద్రాచలం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు, ఉద్యోగులందరు కలిసి మర్యాద దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. ప్రయాణికులకు పూలు, కీ చైన్లను అందజేసి ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. డీఎం మాట్లాడుతూ ఆన్‌లైన్ బుకింగ్ గమ్యం యాప్ డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. ఈ యాప్ నుంచే బస్సుల వివరాలు తెలిపే లింకు, క్యూఆర్ కోడ్ ఉన్న కీ చైన్లను అందజేశారు. ఒక్క క్లిక్‌తో పది ప్రయోజనాలు పొందవచ్చని సూచించారు. అనంతరం విధుల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన కండక్టర్ శివప్రసాద్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కంట్రోలర్, ఉద్యోగులు, సిబ్బంది, ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం, (ఆంధ్రజ్యోతి): భద్రాచలం ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్టీసీ కాంప్లెక్సులో మర్యాదపూర్వక దినోత్సవం నిర్వహించారు. డిపో మేనేజరు తిరుపతి ఆర్టీసీ లోగోతో కూడిన కీ చైన్‌ను ప్రయాణికురాలికి అందించారు. కార్యక్రమంలో సీఐ గౌతమి, స్టేషన్ మేనేజరు అల్లం నాగేశ్వరారవు, వెల్ఫేర్ కమిటీ సభ్యులు కవిత, ఎంఎస్‌రావు, ఆర్కే ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జూలూరుపాడు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతులు చేపడతుండటంతో జూలూరుపాడు సబ్‌స్టేషన్ పరిదిలోని గ్రామాలలో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో మండల ఏఈ సతీష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్‌లైన్లకు మరమ్మతులు కారణంగా ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయటం జరుగుతుందని వినియోగదారులు, రైతులు తమకు సహకరించాలని ఆయన కోరారు.

నైనీ ప్రాజెక్టు ఏర్పాటుతో సింగరేణికి పూర్వవైభవం

రుద్రంపూర్, (సింగరేణి) ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఒరిస్సారాష్ట్రంలోని నైనీ ప్రాజెక్టును సింగరేణి ఏర్పాటు చేయడం చారిత్రాత్మక అవసరమని దీంతో సింగరేణి సంస్థకు పూర్వ వైభవం వస్తోందని బీఎంఎస్ జాతీయ కార్యదర్శి పి. మాధవ్‌నాయక్ అన్నారు. నైనీ ప్రాజెక్టుకు 34 సంవత్సరాల భవిష్యత్ ఉందన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో నైనీ ప్రాజెక్టును ఏర్పాటు చేసేందుకు శ్రమించిన సింగరేణిచైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాంను అభినందించారు. పర్యావరణ అనుమతులు, భూసేకరణ కోసం కృషి చేసిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో బీఎంఎస్ నాయకులు జీవీ.కృష్ణారెడ్డి, ఊట్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలి

దమ్మపేట, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): దమ్మపేట పంచాయతీ పరిదిలో గల దమ్మపేట-మందలపల్లి ప్రధాన రహదారి పక్కనే ఉన్న గ్రామ పంచాయతీకి చెందిన ఖాళీ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని మాస్‌లైన్ మండల నాయకుడు వీరబాబు శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. దమ్మపేట ప్రదాన సెంటర్‌లో చేతి వృత్తులు వారు అద్దెలు చెల్లించలేక పని చేయటంలేదని అన్నారు. పంచాయతీ అధికారులు పరిశీలించి చర్యలు తీసుకొని షాపింగ్ నిర్మాణం చేపట్టాలని కోరారు.

దివ్యాంగ కుటుంబానికి వితరణ

లక్ష్మీదేవిపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీనగర్‌కాలనీ పంచాయతీ పరిధిలోని ఇందిరానగర్‌లో గీతా ఆశ్రమం దగ్గర నివాసం ఉంటున్న కర్నాటి కృష్ణకుమారి కుటుంబానికి శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా ఇండియన్ స్కౌట్ అండ్ గైడ్ ఫెలోషిప్ (ఐఎస్‌జీఎఫ్) ఉమెన్స్ గిల్డ్ ఆధ్వర్యంలో ఆ కుటుంబానికి నిత్యావసరాలు నగదును అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు లోగాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఖాసీం, ఉమెన్స్ గిల్డ్ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ నూరి మెహరున్నీసా పాల్గొన్నారు.

ఏసు చూపిన మార్గంలో జీవించాలి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): లోక రక్షకుడైన ఏసు ప్రభువు చూపిన మార్గంలోనే జీవించాలని ఆయన చూపిన మాదిరిగానే పొరుగువారిపై ప్రేమానురాగాలను ప్రదర్శించాలని కొత్తగూడెం సీఎస్ఐ సెయింట్ ఆండ్రూస్ చర్చ్ పాస్ట్రేట్ ఛైర్మన్ భీమాల అభిజిత్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రమైన కొత్తగూడెం సీఎస్ఐ చర్చిలో గుడ్ ఫ్రైడే (శుభ శుక్రవారం) ప్రత్యేక ఆరాధనలను ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉపవాస దీక్షలను ముగిస్తూ భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించగా ప్రసంగించారు. జిల్లా వ్యాప్తంగా క్రైస్తవ సోదరులు శిలువ మోసి భక్తిని చాటుకున్నారు.

ఈస్టర్ కంటాట నాటికకు భారీ ఏర్పాట్లు ...

తొలిసారి కొత్తగూడెం ఐక్య క్రైస్తవ కమిటీ ఆధ్వర్యంలో ప్రకాశం మైదానంలో ఈస్టర్ కంటాట నాటికకు భారీ ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు.



కొత్తగూడెం ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో శిలువ ధ్యాన యాత్ర



కొత్తగూడెం ఆర్‌సీఎం చర్చి ఫాదర్ జయ ఆనంద్



చండ్రుగొండలో..



అశ్వారావుపేటలో..



జూలూరుపాడులో..



టేకులపల్లి మండలం సులానగర్‌లో..



అశ్వాపురంలో శిలువతో ప్రదర్శన



కొత్తగూడెం సీఎస్ఐ చర్చిలోఆరాధనలో పాల్గొన్న భక్తులు



దుమ్ముగూడెంలో ప్రార్థనలు

సింగరేణి సంస్థ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలి

జనరల్ మేనేజర్ కవితానాయుడు



నియామకపత్రం అందజేస్తున్న జీఎం

రుద్రంపూర్, (సింగరేణి) ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కారుణ్య నియామకాల ద్వార ఉద్యోగం పొందిన యువకులు సంస్థ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని సింగరేణి జనరల్ మేనేజరు (పర్సనల్) కవితానాయుడు కోరారు. రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తే అందరి లక్ష్యం కావాలని ఆకాంక్షించారు. శుక్రవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో కారుణ్య నియామకాల ద్వార ఉద్యోగం పొందిన పలువురికి నియమకం పత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సింగరేణిలో ఉద్యోగం రావడం అదృష్టంగా భావించి క్రమశిక్షణతో,నిజాయితీగా విధులు నిర్వహించాలన్నారు. విద్యావంతులైన యువతకు విద్యార్హతను బట్టి అంతర్గత పరీక్షలు రాసుకునే అవకాశాన్ని యాజమాన్యం కల్పిస్తుందన్నారు. సింగరేణి చైర్మన్ బలరాం సంస్థ అభివృద్ధి కోసం శ్రమిస్తున్నారని అదే స్ఫూర్తితో ఉద్యోగులంతా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం (పర్సనల్) గడిపల్లి రాజేంద్ర ప్రసాద్, కార్మిక సంఘం నాయకులు ఎస్‌వి. రమణమూర్తి, పీతాంబరం, అధికారులు ఉదయ్‌కుమార్, వర ప్రసాద్, శ్యాంకిరణ్‌పాల్గొన్నారు.

ముస్లింల హక్కులు హరిస్తున్న కేంద్రం

- వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ముస్లింల భారీ ర్యాలీ
- పాల్గొన్న ఎమ్మెల్యే తెల్లం, ఎఫ్‌డీసీ చైర్మన్ పొదెం వీరయ్య
- సంఘీభావం తెలిపిన రాజకీయ పక్షాలు



భద్రాచలంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

భద్రాచలం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో శుక్రవారం వక్ఫ్‌బోర్డు చట్ట సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ముస్లిం సోదరుల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్యతో పాటు, సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ నాయకులు హాజరై తమ మద్దతు తెలిపారు. వక్తలు మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం అంబేద్కర్ రాజ్యాంగానికి కూడా తూట్లు పొడిచే విధంగా వ్యవహరిస్తోందన్నారు. ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులకు వ్యతిరేక చట్టాలు తీసుకురావడం జరుగుతోందని విమర్శించారు. దేశంలో వారికున్న తొమ్మిది లక్షల ఎకరాల భూములను లాక్కునే విధంగా పార్లమెంటులో బిల్లు పాస్ చేశారని, ఇది ముస్లింల చట్టాన్ని హరించే విదంగా ఉందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు అబ్దుల్లా సఫీ, అలీపాషా, ఎస్కే అజీమ్, జిందా, సుకూర్, మస్తాన్, అక్బర్, అలీమ్‌ఖాన్, రహీం, జాకీర్, ఖాదర్‌లతో పాటు దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం మండలాలకు చెందిన ముస్లిం కమిటీలతో పాటు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టానికి నిరసనగా ఆందోళన

ఇల్లెందు,(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మత సామరస్యాన్ని విచ్ఛిన్నం చేస్తూ ముస్లింల హక్కులను హరించి వేస్తుందని ఆరోపిస్తూ ఇల్లెందు పట్టణంలో ముస్లింలు మెయిన్ రోడ్డులో ఆందోళనలు జరిపారు. కార్యక్రమంలో పట్టణ ముస్లిం ప్రముఖులు ఇనయతుల్లా, ముతవల్లి హబీబ్, ఎస్కే.జానీ, ఎస్కే.గౌస్, మునాఫ్, సిపిఎం జిల్లా నాయకులు అబ్దుల్ నబి, సిపిఐ నాయకులు నజీర్, సిరాజ్, హసీఫ్, అఖిల్, అసద్, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి,(ఆంధ్రజ్యోతి): టేకులపల్లిలో జరిగిన నిరసనలో ముస్లింమైనార్టీ నాయకులు అనీఫ్, మౌలానా, అబ్దుల్లా, ఖాజా, నహీం, అఫ్రోస్, రహ్మతుల్లా, షకీల్, మసీద్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆళ్లపల్లి (ఆంధ్రజ్యోతి): ఆళ్లపల్లిలో మసీద్ కమిటీ పెద్ద సయ్యద్ హఫీజ్, కమిటీ సభ్యులు నయిమ్, అతహార్, బాబా పాల్గొన్నారు.

గుండాల (ఆంధ్రజ్యోతి): గుండాలలో ముస్లీ కమిటీ సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

సింగరేణి బ్లాస్టింగ్‌లతో ఇళ్లకు బీటలు

- కలెక్టర్‌కు మొరపెట్టుకున్న బాధితులు

మణుగూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలరీస్ కంపెనీ వాళ్లు చేసే బ్లాస్టింగ్‌ల వల్ల మా ఇళ్లు బీటలు పడి పాడై పోతున్నాయి.. లారీలు రాకపోకలు, బాస్టింగ్ దుమ్ము ధూళి కలసి ఆరోగ్యాలను పూర్తిగా పాడు చేసేస్తున్నాయి.. చివరికి తాగే నీరు కూడా కలుషితంగా మారుతోంది.. మా బతుకులు దుర్భరంగా మారాయి సార్.. అంటూ మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోని రాజుపేట వాసులు కలెక్టర్ జితేష్ వి. పాటిల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. శుక్రవారం మణుగూరులో పర్యటించిన కలెక్టర్‌ను కలుసుకుని తమ గోడు వినిపించారు. సింగరేణి ప్రభావిత ప్రాంతాలైన రాజుపేట, విఠల్‌రావునగర్, పీకే వన్ సెంటర్, బాపనకుంట ఏరియాల్లో ప్రతి రోజు బ్లాస్టింగ్‌ల వల్ల ఇళ్లు దెబ్బ తింటున్నాయని తెలిపారు. అతితక్కువ దూరాల్లోనే బ్లాస్టింగ్‌లు చేయడం వల్ల ఇక్కడ బతికే పరిస్థితులు లేకుండా పోయాయన్నారు. ఇక్కడ జీవనం సాధ్యం కాదని రోగాలతో చచ్చే పరిస్థితులు ఉన్నాయని అధికారులు దృష్టి సారించి మంచి పరిహారం ఇచ్చి సురక్షిత ప్రాంతాలకు తమను తరలించాలని ఆదుకోవాలని కలెక్టర్‌కు వినతి పత్రాన్నిఅందించారు. ఈ కార్యక్రమంలో రాజుపేట, విఠల్‌రావునగర్, పీకేవన్ సెంటర్ ప్రాంత వాసులు, రైతులు పాల్గొన్నారు. కాగా ఈ విషయంపై స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని, క్షేత్ర స్థాయిలో పరిశీలనలు చేస్తానని తెలిపారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

వరంగల్ సభను విజయవంతం చేయండి

పాల్వంచటౌన్/కొత్తగూడెం టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వనమా వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం పాత పాల్వంచలోని వనమా స్వగృహంలో జరిగిన పార్టీ నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణకు కేసీఆర్ రక్ష అని, ఈ వరంగల్ సభతో కాంగ్రెస్ ఖేల్ ఖతం కాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వనమా రాఘవేంద్రరావు, సీనియర్ నాయకులు కిలారు నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు ముంతపురి రాజుగౌడ్, సొసైటీ వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేష్, మండల అధ్యక్షులు పూసల విశ్వనాథం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : అబద్ధపు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి వరంగల్ బీఆర్ఎస్ మహాసభతో వణుకు పుట్టాలని కొత్తగూడెం మున్సిపల్ మాజీచైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి అన్నారు. 25ఏళ్ల బీఆర్ఎస్ రజతోత్సవాల కోసం భారీగా జనసమీకరణ చేస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం కొత్తగూడెంలో జరిగిన పలు సమావేశాల్లో ఆమె మాట్లాడారు. కొత్తగూడెంలో వాల్‌రైటింగ్ రాసి కార్యకర్తలను ఉత్సాహ పరిచారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కాపు కృష్ణ, ఖాజా, మజీద్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి: కూనంనేని

కొత్తగూడెం/పాల్వంచటౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : నియోకవర్గ అభివృద్ధికి, ప్రజలకు కావాల్సిన మౌళిక వసతుల కల్పనకు, వసతుల ఏర్పాటుకు నిరంతరం కృషి చేస్తున్నానని, ప్రభుత్వం మంజూరు చేస్తున్న ప్రతి పైసా దుర్వినియోగం కాకుండ నిత్యం పర్యవేక్షిస్తూ ప్రజల కోసం వెచ్చిస్తున్నామని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలంలోని లోతువాగులో రూ.16లక్షల నిధులతో నిర్మించిన సబ్‌సెంటర్ భవనానికి, చుంచుపల్లి మండలంలోని రామాంజనేయకాలనీలో రూ.20లక్షల వ్యయంతో, వెంకటేశ్వరకాలనీలో రూ.20లక్షల వ్యయంతో, విద్యానగర్‌కాలనీలో రూ.16లక్షల వ్యయంతో నిర్మించిన నూతన భవనాలను శుక్రవారం ఎమెల్యే ప్రారంభించి ప్రజాసేవకు అంకితం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి మండలాల పరిధిలో ఐటీడీఏ నిధులతో నాలుగు వాగ్దానాలు నిర్మాణం పూర్తి చేసుకున్నాయని తెలిపారు. ఇప్పటికి నియోజకవర్గ పరిధిలోని వివిధ పథకాల్లో మంజూరైన నిధులతో రోడ్లు, డ్రెయిన్లు ప్రాధాన్య క్రమంలో పూర్తి చేశామని, ప్రజలకు నిత్యావసరాలైన తాగునీరు, విద్యుత్ సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. వేసవిలో నీటి ఎద్దడి రాకుండ ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని, ఎమ్మెల్యే నిధులతో నియోజకవర్గంలో 14 సంఘాల భవనాలు, 7 బస్సు షెల్టర్లు, విద్యుత్‌స్తంభాలు, ప్రభుత్వ భవనాలు, విద్యాలయాల అభివృద్ధి, రహదార్లు, డ్రైన్లు నిర్మించనున్నామని, వీటికోసం రూ.10కోట్ల ప్రతిపాదనలు సిద్ధం చేశామని త్వరలో వీటికి మంజూరు లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, జిల్లా వైద్యాధికారి భాస్కర్‌నాయక్, తహసిల్దార్లు కేవీఆర్‌కే. ప్రసాద్, కృష్ణ, ఎంపీడీవో హంకుబాబు, శుభాషిణి, ఐటీడీఏ అధికారులు శ్రీకాంత్, మధుకర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కొత్తగూడెం క్లబ్‌లో నియోజకవర్గ పరిధిలోని 170మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ ద్వార మంజూరైన రూ.69.50లక్షల విలువ చేసే చెక్కులను, 86మంది కల్యాణ లక్ష్మి, షాదిముబారక్ పథకంలో మంజూరైన రూ.86.86లక్షల విలువైన చెక్కులను అందించారు.

పాల్వంచటౌన్, (ఆంధ్రజ్యోతి): పాల్వంచ మునిసిపల్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్దిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ఎమ్మెల్యే మండల, పట్టణ పరిధిలోని 46 మంది లబ్దిదారులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వివేక్, మునిసిపల్ కమిషనర్ సుజాత, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, సీపీఐ, కాంగ్రెస్, టీడీపీ నాయకులు ఎర్రంశెట్టి ముత్తయ్య, కనగాల అనంతరాములు, నూకల రంగారావు, బండి నాగేశ్వరరావు, ఉప్పు శెట్టి రాహుల్, వివిధ శాఖల అధికారులు, పాల్గొన్నారు.